సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుస్తోంది. ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తోంది. కూటమి ప్రభుత్వంపై విశ్వాసంతో పెట్టుబడులు పెరుగుతుండగా, వాటి క్రెడిట్‌ను జగన్ తీసుకునే అనైతిక ప్రయత్నం చేస్తున్నారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మంగళవారం 28.04.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 6 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# నూతన ఆవిష్కరణలకు వేదికగా వర్సిటీలు






- రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఏయూ దిక్సూచి
- యువత జాబ్ సీకర్స్ కాదు... జాబ్ క్రియేటర్స్ అవ్వాలి
- గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖకు కొత్త చరిత్ర
- ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకల్లో ముఖ్యమంత్రి
- ఏయూ అభివృద్ధికి రూ.500 కోట్లు ప్రకటించిన సీఎం

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** యూనివర్సిటీలు డిగ్రీలు ఇచ్చే విద్యా కేంద్రాలు మాత్రమే కాదని... సమాజాన్ని ప్రభావితం చేసే ఆవిష్కరణలకు వేదిక కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. యూనివర్సిటీలు జాతీయ ఆస్తులని, వాటిని కాపాడుకోవాలని అన్నారు. విశాఖలో జరిగిన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పాల్గొన్నారు. యూనివర్సిటీలో రూ.64 కోట్లతో చేపట్టిన ఏయూ ఐ ఫ్యాక్టరీ, నెట్వర్క్ సెంటర్‌ను ప్రారంభించారు. మరో రూ.112 కోట్లతో 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్, కాన్వకేషన్ హాలుతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.

**ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలి :** విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా... రోజులు మారాయి.. సాధారణ మనుషులు అసాధారణ శక్తిగా మారే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "నాలెడ్జ్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లపై యువత దృష్టి పెట్టాలి. పారిశ్రామిక రంగానికి యూనివర్సిటీ అనుసంధానం కావాలి. మీరు ఉద్యోగం చేయడం కాదు, పది మందికి ఉద్యోగం ఇచ్చే శక్తి మీకు రావాలి... దీనికి సహకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నేను ఎన్నో కార్యక్రమాలకు వెళ్లాను కానీ... యూనివర్సిటీలో మీ ఉత్సాహం చూస్తుంటే ఆనందం ఆకాశాన్ని తాకుతోంది. విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్నాను. రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నేను విశాఖ వచ్చాను. 100 ఏళ్ల ఏయూ పండుగ ఒక చరిత్ర. రేపు ప్రపంచంలో నెంబర్ 1 టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ సంస్థ డేటా సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన మరో చరిత్ర. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నారంటే అది విశాఖ గొప్పతనం. గూగుల్ కంటే ముందుగానే ఏయూ ప్రపంచాన్ని విశాఖతో కనెక్ట్ చేసింది. 58 దేశాల విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారంటే రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం. విశాఖ విశ్వనగరం... గ్లోబల్ సిటీ. ఇది అన్ స్టాపబుల్. ఎవరూ ఆపలేరు. ఏయూ 100 ఏళ్ల చరిత్ర ఒక బ్రాండ్. రాష్ట్ర విభజన తర్వాత కేబినెట్ సమావేశం ఏయూలో నిర్వహించాం... అదీ ఏయూ ప్రత్యేకత. 53 యూనివర్సిటీలు రాష్ట్రంలో ఉన్నాయి... అన్నింటికీ ఏయూ దిక్సూచి, లీడర్. స్వాతంత్ర్య పోరాటం కంటే ముందే ఈ యూనివర్సిటీ వచ్చింది.



మిగతా 2లో...

## రవాణా శాఖ అప్రమత్తం



- ఇంధన కొరత ఉన్నా బస్సులు ఆగవు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఎక్కడా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రవాణా సంస్థలు తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి పత్రికా ప్రకటన విడుదల చేశారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో తాత్కాలిక అంతరాయాలు ఉన్నప్పటికీ,

మిగతా 2లో...

## ప్రపంచ దిగ్గజ సంస్థ గూగుల్ కు సాదర స్వాగతం



- ఈ నెల 28న శంకుస్థాపనతో పనులకు శ్రీకారం
- విశాఖ వాకిట నవ్యాంధ్రుల కలలకు సాకారం
- తెలుగు దేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కృషి అమోఘం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం ఫలితం విశాఖలో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన

మిగతా 2లో...

## ఏయూ చరిత...

# తరతరాలకు స్ఫూర్తి



- ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇన్ స్టిట్యూషన్ మాత్రమే కాదు.. ఒక ఎమోషన్
- ఏయూ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికే గర్వకారణం
- దేశంలోనే అత్యంత ప్రాచీన యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి
- ఆంధ్ర యూనివర్సిటీ అభివృద్ధికి ఎంతోమంది కృషిచేశారు
- దేశంలోనే ఓవర్ ఆల్ ర్యాంకింగ్స్ లో ఏయూ 3వ స్థానం సాధించడమే లక్ష్యం
- ఫిజిక్స్ నుంచి పాలిటిక్స్ వరకు ఆంధ్ర యూనివర్సిటీ మార్క్ శాశ్వతంగా ఉంది

**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్)** ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇన్ స్టిట్యూషన్ మాత్రమే కాదని, తనలాంటి వారికి ఒక ఎమోషన్ అని, ఏయూ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికే గర్వకారణమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సోమవారం విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో సీఎం చంద్రబాబునాయుడు గారితో కలిసి మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ వేడుకలకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఈ రోజు ఒక గర్వకారణమైన, చరిత్రాత్మక సందర్భం. శతాబ్ద కాలంగా వెలుగొందుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం గొప్పదనాన్ని జరుపుకునేందుకు మనం అందరం ఇక్కడకు వచ్చాం.

మిగతా 2లో...

# బంగాల్ ఎన్నికల ప్రచారానికి ముగింపు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. తాను మే 4 తర్వాత బీజేపీ ప్రభుత్వ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొనేందుకు మళ్లీ రాష్ట్రానికి వస్తానని ఆయన అన్నారు. బంగాల్ రెండో దశ ఎన్నికల పోలింగ్‌కు ముందు బారక్‌పుర్‌లో నిర్వహించిన విజయ్ సంకల్ప్‌ర్యాలీలో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'బంగాల్‌తో నాకున్న అనుబంధం ఒక శక్తి ఆరాధన లాంటిది. ఇది నా వ్యక్తిగత ఆధ్యాత్మిక ప్రయాణానికి శక్తి కేంద్రంగా నిలిచింది. బంగాల్‌కు చెందిన గొప్ప వ్యక్తులు, ప్రజల అపార ప్రేమే నాకు స్ఫూర్తి. ఈ గడ్డపై నేను పొందిన అనుభవాలను నాకు లభించిన గొప్ప ఆశీర్వాదంగా భావిస్తున్నాను' అని మోదీ పేర్కొన్నారు.

**ఇదే చివరి సభ! :** ప్రస్తుత బంగాల్ ఎన్నికల ప్రచారంలో ఇదే తన చివరి బహిరంగ సభ అని మోదీ అన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు బీజేపీకి అనుకూలంగా వస్తాయనే విశ్వాసం తనకుందన్నారు. "ఈ ఎన్నికల్లో ఇదే నా చివరి ర్యాలీ. బంగాల్‌లో నేను ఎక్కడికి వెళ్లినా, అక్కడి ప్రజల మనోభావాలను నేను గమనించారు. మే4న ఫలితాలు వచ్చిన తర్వాత, బీజేపీ ప్రభుత్వ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరయ్యేందుకు నేను తిరిగి వస్తాననే నమ్మకంతో వెళ్తున్నాను" అని మోదీ తెలిపారు.

**అంగ, వంగ, కళింగ అభివృద్ధి చెందాలి! :** బారక్‌పుర్‌లో మోదీ మాట్లాడుతూ, బంగాల్ ఎన్నికలు కేవలం ఆ రాష్ట్రానికే కాకుండా మొత్తం తూర్పు భారతదేశ భవిష్యత్తుకే కీలకమని అన్నారు. భారత భాగ్యోదయం, పూర్వోదయం (తూర్పు భారత్ అభివృద్ధి) లేకుండా అసంపూర్ణమని మోదీ వ్యాఖ్యానించారు. భారతదేశంలో గతంలో అత్యంత సుభిక్షంగా అంగ (బిహార్), వంగ (బంగాల్), కళింగ (ఒడిశా) అనే మూడు బలమైన స్తంభాలు ఉండేవని మోదీ గుర్తు చేశారు. ఈ మూడు ప్రాంతాలు బలహీనపడడం వల్లే దేశ సామర్థ్యం దెబ్బతిందని, ఇప్పుడు భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ఈ మూడు ప్రాంతాల అభివృద్ధి ఎంతో అవసరమని ఆయన అన్నారు. "గతంలో బిహార్‌లో కమలం వికసించింది. ఒడిశాలోనూ కమలం విజయం సాధించింది. ఇప్పుడు బంగాల్ వంతు వచ్చింది. ఇక్కడి వాతావరణం చూస్తుంటే బంగాల్‌లో కూడా కమలం వికసించడం ఖాయమని అనిపిస్తోంది. అంగ-వంగ-కళింగ అనే త్రిశక్తి నమ్మకం ఇప్పుడు బీజేపీపైనే ఉంది" అని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

మిగతా 2లో...

## అటవీ సంపదను తగలబెడితే ఊరుకోం!

- శేషాచలం ప్రమాదంపై డిప్యూటీ సీఎం ఆగ్రహం
- శేషాచలం అడవుల్లో అగ్నిప్రమాదంపై పవన్ కళ్యాణ్ ఆరా
- మంటలు విస్తరించకుండా తక్షణం అదుపు చేసే చర్యలు చేపట్టండి
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం
- ఘటనపై పీసీసీఎఫ్ వివరణ కోరిన ఉపముఖ్యమంత్రివర్యులు
- ప్రజల భాగస్వామ్యంతో అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచన

3 లో



## వైద్యసేవ బకాయిల మోక్షం!

- 'బిల్ డిస్కౌంటింగ్' విధానంలో బకాయిల చెల్లింపులు
- రూ. వెయ్యి కోట్లు జమ చేసేలా ప్రభుత్వ నిర్ణయం
- ప్రత్యేక పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 323 ఆసుపత్రుల యాజమాన్యాల దరఖాస్తులు
- ఒప్పందాలకు అనుగుణంగా 25 అస్పత్రులకు రూ. 62 కోట్లు చెల్లింపు
- మంత్రి సత్యకుమార్ యాదవ్‌కి నివేదించిన అధికారులు




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు రూ.1,000 కోట్ల బకాయిలను 'ట్రై-పార్టీ బిల్ డిస్కౌంటింగ్. అగ్రిమెంట్' (టీబీడీఏ) విధానంలో చెల్లింపుల ప్రక్రియను కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేకంగా రూపొందించిన 'ఏపీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ అండ్ సర్వీసెస్-బిల్ డిస్కౌంటింగ్' వెబ్ పోర్టల్ ద్వారా ఎన్టీఆర్ వైద్యా సేవా ట్రస్టు సదరు ఆసుపత్రుల యాజమాన్యాలతో ఒప్పందాలు చేసుకుంటోంది. 323 ఆసుపత్రుల యాజమాన్యాలు టీబీడీఏ విధానం కింద ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్నాయి. ఒప్పందాల అనంతరం పలు ఆసుపత్రుల కు చెల్లిశీపుల ప్రక్రియ ప్రారశీభం మొదలయింది. సుమారు 25 అస్పత్రులకు రూ. 62 కోట్ల వరకు చెల్లిశీపులు జరిగాయి.

ప్రస్తుతం రూ. 2,044 కోట్లను 873 ప్రైవేటు ఆసుపత్రులకు కూటమి ప్రభుత్వం బకాయిల కింద చెల్లించాల్సి ఉంది. ఇందులో రూ. 1,000 కోట్లకు సంబంధించి బిల్లుల పరిశీలన పూర్తయిశీది. ఈ మేరకు టీబీడీఏ విధానంలో ఒప్పందాలు చేసుకున్న అసుపత్రుల యాజమాన్యాల బ్యాంకు ఖాతాలకు బకాయిల

మిగతా 3లో...

## నిరంతరాయ విద్యుత్ సరఫరా



- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా ఉత్పత్తి పెంచేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు.

మిగతా 2లో...

## విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు



- విద్యుత్ కొనుగోలు ఛార్జీలను యూనిట్‌కు రూ.4.60కు తగ్గించేలా ప్రణాళికలు
- రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యం
- ఇంధన రంగంలో పరిశోధనకు ప్రత్యేక ఎనర్జీ యూనివర్శిటీ
- విద్యుత్ శాఖ పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష

3 లో

## ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

- రైతులకు మంత్రి కందుల దుర్గేష్ భరోసా



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్) :** ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. నిడదవోలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా సోమవారం సమిశ్రగూడెం మీదుగా ప్రయాణిస్తున్న మంత్రి కందుల దుర్గేష్ రోడ్డు పక్కన ఆరబోసిన ధాన్యం బస్తాలను చూసి తన వాహనాన్ని ఆపి రైతుల వద్దకు వెళ్లారు. నేరుగా రైతులు, కూలీలతో ముచ్చటించిన మంత్రి దుర్గేష్ ధాన్యం కొనుగోలులో వారికి ఎదురవుతున్న ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణలో జాప్యం జరగకూడదని,

మిగతా 3లో...

# రవాణా శాఖ అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)



ప్రయాణికుల సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.
ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సులు మరియు ఇతర రవాణా సేవలు నిరంతరంగా కొనసాగించాలని, రవాణా సంస్థలు, ప్రైవేట్ ఆపరేటర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎక్కడైనా నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులకు అసౌకర్యం కలిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఆందోళన చెందకుండా సహకరించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు.

# ప్రపంచ దిగ్గజ సంస్థ గూగుల్‌కు సాదర స్వాగతం



శ్రీకాకుళం(జర్నలిస్ట్ ఫైల్) : నవ్యాంధ్రుల కలల సాకారానికి ప్రాధాన్యం ఇస్తూ, ఉత్తరాంధ్ర కే మణిమకుటంగా అలరారే గూగుల్ డేటా సెంటర్ కు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్య రీతి సాఫల్యం పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. అలానే పెట్టుబడుల ఆకర్షణలో భాగంగా రాష్ట్రాన్ని అగ్రగామిగా మలిచే క్రమంలో భాగంగా ఐటీ శాఖామాత్యులు, తెలుగు దేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ కృషి అమోఘం అని ఆయన శ్రమ అనిర్వచనీయం అని చెప్పారు. ఈ నెల 28న తర్లువాడలో 266.6 ఎకరాలలో విఖ్యాత ఐటీ కంపెనీ గూగుల్ ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ కు శంకు స్థాపన చేయడం శుభ పరిణామం అని అన్నారు. మొత్తంగా విశాఖ కేంద్రంగా మూడు చోట్ల ఏర్పాటు అయ్యే గూగుల్ డేటా సెంటర్ల కు సంబంధించి తొలి దశలో భాగంగా తర్లువాడ డేటా సెంటర్ ఏర్పాటుకు దిగ్గజ సంస్థల అధినేతలు తరలి రావడం ఉత్తరాంధ్రకే సొంతం అయ్యే చారిత్రక పరిణామం అని అభిప్రాయపడ్డారు.

**సమర్థ నాయకత్వానికి ప్రతిబింబం :** ఇప్పటికే విశాఖ కేంద్రం గా ఐటీ నగరం అభివృద్ధి దిశగా కాగ్నిజెంట్ తో సహా కీలక సంస్థల రాక , కార్యకలాపాల నిర్వాహణ అన్నది సమర్థనీయంగా సాగడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. కూటమి సర్కారు ఏర్పాటు అయి రెండేళ్లు పూర్తి కాకమునుపే ఇప్పటికే లక్ష కోట్ల పెట్టుబడులు రావడం ఆనందదాయకం అని, ఐటీ రంగానికి ఊతం ఇచ్చే దిశగా వైజాగ్ మెగా డేటా పార్కు లిమిటెడ్ పేరుతో 1.35 లక్షల కోట్ల రూపాయల నిధులతో అదానీ భాగస్వామ్యంతో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్టు అందరి కలలకూ రూపం అని అభిప్రాయపడ్డారు. విద్యా ఉపాధి మౌలిక వసతుల కల్పన వంటి అంశాలతో ముడిపడిన ఈ ప్రాజెక్టు రూపకల్పన నవ్యాధ్ర సారథి చంద్రబాబు సమర్థతకు సంకేత రూపమని కొనియాడారు. విశాఖ కేంద్రం ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సెమికండక్టర్ రంగాలలో పెట్టుబడులకు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకుంటున్న చొరవ సత్ఫలితాలు ఇస్తోందని, గత ఏడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకూ వివిధ దశలలో అటు అమెరికా కేంద్రంగానూ ఇటు విశాఖ కేంద్రంగానూ ఆయన తీసుకున్న చర్యలు పురోగామి దిశగా ఉండడం సమర్థ నాయకత్వానికి ప్రతిబింబం అని అన్నారు.

**ఉత్తరాంధ్ర అంటే చంద్రబాబు నాయుడుకి మమకారం... :** గూగుల్ హబ్ రాకతో సంబంధిత రంగాల ఆధారంగా ఏర్పాటు అయ్యే కంపెనీలలో దాదాపు రెండు లక్షల మంది వరకూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నాయని అంచనాగా తెలిపారు. ఆ రోజు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐటీ రంగ అభివృద్ధికి సంబంధించి కనీస చర్యలు లేకపోవడంతో సంబంధిత వ్యవస్థలు అన్నీ కునారిల్లాయని, మళ్లీ ఐటీ రంగం కోలుకునేందుకు ముఖ్యమంత్రితో పాటూ ఐటీ శాఖామాత్యులు తీసుకున్న నిర్ణయాల కారణంగా సంబంధిత రంగాలు అన్నీ పునరుత్తేజం చెందాయని గుర్తుచేశారు. ఆ రోజు వైసీపీ హయాంలో రాష్ట్రం పురోగామి కాకుండా తిరోగమన రూపంలో ఉండిపోవడంతో అభివృద్ధి ఎక్కడికక్కడ నిలిచిపోయిందని, తద్వారా ఏపీ బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా జీరో లెవల్ కు పడిపోయిందని ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వం రాకతో కేంద్రం అందిస్తున్న చేయూత కారణంగా డబుల్ ఇంజన్ సర్కారు చేపడుతున్న చర్యలు ఫలించి, ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఐటీ రంగంతో పాటే ఫార్మా, ఇండస్ట్రియల్ సెక్టార్లలో కూడా సంబంధిత దిగ్గజ సంస్థలు రావడం ఉత్తరాంధ్రకే సంబంధిత అవకాశాలు ఎక్కువగా దక్కడం ముఖ్యమంత్రి కి ఈ ప్రాంతం అంటే ప్రేమ అని అనేందుకు నిదర్శనం అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశంసించారు.

# నిరంతరాయ విద్యుత్ సరఫరా



(మొదటి పేజీ తరువాయి)

తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం నాడు మంత్రి గొట్టిపాటి రవి కుమార్.. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మూడు డిస్కంల సీఎండీలు పృథ్వీతేజ, శివశంకర్, పుల్లారెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్ లు హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వేసవి కాలంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రోజుకు సుమారు 275 నుండి 285 మిలియన్ యూనిట్ల వరకు ఉండే అవకాశం ఉందని తెలిపారు. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా బ్రేక్‌డౌన్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా గృహ, వ్యాపార, పారిశ్రామిక, వ్యవసాయ వినియోగదారులకు నిరంతర సరఫరా కొనసాగించాలని స్పష్టం చేశారు. విద్యుత్ కొనుగోళ్లు తగ్గిస్తూ.. డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని సూచించారు. అదే విధంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ అమలును మరింత వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. పథకాల సమర్థవంతమైన అమలుకు ఉన్నతాధికారులు కూడా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటనలు చేపట్టాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యం ప్రకారం, ఆగస్టు నాటికి 6 లక్షల పీఎం సూర్యఘర్ కనెక్షన్లను తప్పక పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

# నూతన ఆవిష్కరణలకు వేదికగా వర్సిటీలు

(మొదటి పేజీ తరువాయి)



జైపూర్ రాజ్ విక్రమ దేవ్, గజపతి, పిఠాపురం, బొబ్బిలి రాజులు ఈ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేశారు. వారిని మనం స్మరించుకోవడం ధర్మం, బాధ్యత. కట్టమంచి రామలింగారెడ్డి ఏయూకు మొదటి వీసీగా చేసి బలమైన పునాది వేశారు. ఆయన కూడా చిత్తూరు జిల్లా వాసే... నేనూ చిత్తూరు జిల్లా నుంచి వచ్చి వందేళ్ల ఉత్సవంలో పాల్గొన్నాను. 2వ వీసీ సర్వేపల్లి రాధాకృష్ణ... దేశ రాష్ట్రపతి అయ్యారు. ఈ రోజు మన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తండ్రి సర్వేపల్లి రాధాకృష్ణ అభిమాని. ఈయనకు రాధాకృష్ణన్ అని పేరు పెట్టారు. కేవలం చదువు చెప్పడమే కాదు... తెలుగు వైభవానికి ఏయూ కృషి చేస్తోంది. విద్య, సాహిత్య, కళా రంగాల్లో ప్రముఖులను కళా ప్రపూర్ణ అవార్డుతో గౌరవిస్తున్నారు' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**26 ఏళ్ల యువకుడిలా నా ఆలోచనలు :** రాష్ట్రంలో ఎంతోమంది నాయకులను తయారు చేసిన గడ్డ ఆంధ్ర యూనివర్సిటీ అని, ఎందరో రాజకీయ ఉద్దండులు ఇక్కడ నుంచే వచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఏయూ నుంచే వచ్చారు. ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కూడా ఇక్కడి నుంచే వచ్చారు. ప్రపంచంలోని చాలా యూనివర్సిటీల్లో ఇక్కడ చదువుకుని వెళ్లిన వారు ప్రొఫెసర్లుగా చేస్తున్నారు. న్యాక్ ఏ ప్లస్ ప్లస్‌ను ఏయూ సాధిస్తోంది. ఎన్ఐఆర్ఎఫ్‌లో 41వ ర్యాంక్, పబ్లిక్ సెక్టార్‌లో 5వ ర్యాంక్‌లో ఉంది. అన్ని యూనివర్సిటీల్లో విద్యాశాఖామంత్రి, గవర్నర్ ప్రతిభ ఉన్నవారిని వీసీలుగా ఎంపిక చేస్తున్నారు... ముఖ్యమంత్రిగా వారిని అభినందిస్తున్నాను. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెట్రాలజీతో ఎంఓయూలు కుదుర్చుకున్నాం. నాకు 76 ఏళ్లయినా.. నేను 26 ఏళ్ల యువకుడిలానే ఆలోచిస్తాను. ఒకప్పుడు మనం ఐటీ ప్రారంభించాం... హైటెక్ సిటీ కట్టాం. నాలెడ్జ్ ఎకానమీకీ దోహదం చేశాం. నేడు డేటా సెంటర్, ఏఐ, క్వాంటం తీసుకొచ్చాం. వీసీని కోరుతున్నా... ఏయూకు బ్రాండ్ ఉంది. మీరు అడిగితే ప్రపంచంలోని చాలా యూనివర్సిటీలు మీతో ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉంటాయి. వంద దేశాల విద్యార్థులు మన యూనివర్సిటీల్లో చదివేలా సిద్ధం చేయాలి. సంపద సృష్టించే మార్గదర్శులుగా మారే అవకాశం మీకు ఉంది. ఎంట్రప్రెన్యూర్లుగా ఏయూ ఎంతమందిని తయారు చేస్తుందనేది మీ మీద ఆధారపడి ఉంది. ఇక్కడ ఆర్టీఐహెచ్ ఏర్పాటు చేశాం. భవిష్యత్ డేటా సెంటర్, ఏఐ, క్వాంటం రంగాలదే. పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే ఆస్తి చదువు. చదువుతో ప్రపంచాన్ని జయించే ఆత్మవిశ్వాసం వారికి వస్తుంది. ఏయూ చాలా సుందరమైన ప్రాంతం. ఒత్తిడి ఉన్నప్పుడు సముద్ర తీరంలో కాసేపు నడిస్తే సేదతీరుతారు' అని సీఎం అన్నారు.

**ఏయూ అభివృద్ధికి రూ.500 కోట్లు :** 'ఏయూలో చదువుకునేవారంతా అదృష్టవంతులు. ఇక్కడ చదువుకుంటే ఎంత బావుటుందో అనే ఆలోచన మళ్లీ నాకూ వస్తోంది. ఈ యూనివర్సిటీ భావితరాల నాయకులను తయారు చేయాల్సి ఉంటుంది. ఉపకులపతికి లక్ష్యం నిర్దేశిస్తున్నాం... ఏయూ దేశంలో యూనివర్సిటీల్లో టాప్-5 జాబితాలో ఉండాలనేది నా ఆకాంక్ష. ప్రపంచంలో 100 అత్యుత్తమ యూనివర్సిటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ ఉండాలి. ఈ స్థాయిలో అభివృద్ధి చేయాలంటే నిధులు కావాలి. అందుకే రూ. 500 కోట్లను ఆంధ్ర యూనివర్సిటీకి ఇస్తాం. రూ. 500 కోట్ల కార్పస్ ఫండ్ వస్తుంది. ఒక్కో విద్యార్థి ఒక్కో రూపాయి చొప్పున సాయం అందించినా చాలు. ఏయూ పూర్వ విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధ్యమే అవుతుంది. ఏయూ వందేళ్ల చరిత్ర రోజున చెప్తున్నా... రాబోయే వందేళ్లలో ఏయూ మరో చరిత్ర సృష్టిస్తుంది... బెస్ట్ బ్రాండ్ క్రియేట్ చేస్తుంది' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ఏయూ నుంచే జైత్ర యాత్ర ప్రారంభం :** 'ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడం నా అదృష్టం. ఇక్కడ బంగారం లాంటి విద్యార్థులు ఉన్నారు... మంచి ప్రొఫెసర్లు ఉన్నారు. ప్రపంచంలోని నాలెడ్జ్‌ను ఇక్కడికి తీసుకొస్తాం. నేను, నా మిత్రుడు పవన్ కళ్యాణ్ ఈ రాష్ట్రాన్ని పునర్ నిర్మించేందుకు ముందుకొచ్చాం. తెలుగుజాతి పునర్వైభవానికి ప్రధాని మోదీ మనకు సహకరిస్తున్నారు. వారి సంకల్పం వికసిత్ భారత్ 2047. మన లక్ష్యం స్వర్ణాంధ్ర 2047. 2047 నాటికి ప్రపంచంలోనే నెంబర్ 1 జాతిగా తెలుగు జాతి ఉండాలనేది మా సంకల్పం. మా సంకల్ప జైత్ర యాత్ర ఏయూ నుంచే ప్రారంభం కావాలి. పని చేసే బాధ్యత మాది, సహకరించే బాధ్యత మాది... దాన్ని నిరూపించుకునే బాధ్యత మీదే' అని విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఒడిశా గవర్నర్ హరిబాబు, కేంద్రమంత్రులు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేష్, మాజీ క్రికెటర్ సచిన్, దర్శకుడు త్రివిక్రమ్, మంత్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# బంగాల్ ఎన్నికల ప్రచారానికి ముగింపు

(మొదటి పేజీ తరువాయి)

**వందేమాతరమే మంత్రం కావాలి! :** "1857 ప్రథమ స్వాంత్ర్య సంగ్రామంలో బారక్‌పుర్ కీలక పాత్ర పోషించింది. అదే నేల ఇప్పుడు బంగాల్?లో మార్పునకు బాటలు వేస్తోంది. ప్రస్తుతం బంగాల్ అంతటా ఒకటే నినాదం వినిపిస్తోంది. అదే 'మార్పు కావాలి, బీజేపీ ప్రభుత్వం రావాలి'" అని మోదీ అన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వందేమాతరం ఒక మార్గదర్శక శక్తిగా నిలిచిందని, 21వ శతాబ్దంలో బంగాల్ అభివృద్ధికి, పునర్నిర్మాణానికి అది ఒక మంత్రంగా పనిచేయాలని మోదీ పేర్కొన్నారు. బంగాల్ ప్రజలకు పురోభివృద్ధి, ఉపాధి అవకాశాలు, మెరుగైన భద్రత కల్పిస్తామని ఈ సందర్భంగా మోదీ హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని సుభిక్షమైన, సంతోషకరమైన భూమిగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. 'బీజేపీ ప్రభుత్వంలో ఎవరూ ఇబ్బందిపడరు. వ్యక్తులు ఏ కులానికి లేదా వర్గానికి చెందినవారనేది ముఖ్యం కాదు. అయితే బంగ్లాదేశ్ చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. మతువా సామాజిక వర్గం వారికి పౌరసత్వం మంజూరు చేస్తామని' మోదీ హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా, ప్రచార కార్యక్రమాల్లో ప్రజల నుంచి తనకు అందిన సందేశాలు, కానుకల గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వాటిని తాను ఎంతో గౌరవిస్తానని తెలిపారు. "బంగాల్‌లో జరిగిన ర్యాలీలు, రోడ్‌షోల సమయంలో నాకు ఎంతో హృద్యమైన సందేశాలు, చిత్రపటాలను అందించారు. వాటిని నేను ఎప్పటికీ మర్చిపోలేను. కార్యక్రమాలు ముగిసిన తర్వాత రాత్రి వేళల్లో ఆయా చిత్రపటాలను నేను నిశితంగా చూస్తూ, ఆ కళాకారుల భావోద్వేగాలను అర్థం చేసుకుంటాను. నేను ప్రతి సందేశాన్ని, లేఖను చదువుతాను. కొన్నింటిలో మీ బాధ కనిపిస్తుంది. మరికొన్నింటిలో మీ దీవెనలు ఉంటాయి" అని మోదీ చెప్పారు.

**నా బాధ్యతలను నెరవేరుస్తా! :** మరోవైపు, దశాబ్దాల తన రాజకీయ ప్రయాణాన్ని మోదీ ప్రస్తావించారు. సంస్థాగత, ఎన్నికల బాధ్యతల్లో తాను నిరంతరం నిమగ్నమై ఉన్నానని మోదీ పేర్కొన్నారు. "గత మూడు, నాలుగు దశాబ్దాలుగా నేను దేశంలోని ప్రతి మూలకు ప్రయాణించాను. రాజకీయాల్లోకి వచ్చి, బీజేపీలో చేరినప్పటి నుంచి, పార్టీ కార్యకర్తగా నాకు అప్పగించిన ప్రతి బాధ్యతను, ఎన్నికల విధులతో సహా నిర్వర్తిస్తున్నాను. పగలు, రాత్రి అని గానీ, వాతావరణం ఎలా ఉందనిగానీ చూడకుండా నిరంతరం ముందుకు సాగుతుంటాను. నేను ఇల్లు వదిలినప్పటి నుంచి మీ మధ్యనే ఓదార్పును, ప్రశాంతతను పొందుతున్నాను. మీరే నా కుటుంబం" అని ఆయన అద్వేగంగా అన్నారు.

ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఉన్న బారక్?పుర్? అసెంబ్లీ నియోజక వర్గం, రెండో దశ ఎన్నికల్లో త్రిముఖ పోటీకి సిద్ధమైంది. ఈ జనరల్ సీటులో ప్రస్తుత ఎమ్మెల్యే, తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి, సినీ దర్శకుడు రాజ్? చక్రవర్తి పోటీ చేస్తున్నారు. సీపీఐ(ఎం) తరఫున సుమన్ రంజన్? బందోపాధ్యాయ బరిలోకి దిగారు. బీజేపీ తరఫున కౌస్తవ్? బాగ్చీ రంగంలోకి దిగారు. ఆయన తరఫున ప్రధాని మోదీ ఇవాళ ప్రచారం నిర్వహించారు. ఆదివారం ఉత్తర కోల్‌కతా రోడ్‌షో ప్రారంభించే ముందు ప్రధాని మోదీ 300 ఏళ్లనాటి తాంతనియా కాళీబారి ఆలయంలో అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. 1703లో వెలసిన ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందినది. ఇక్కడ కాళీ మాతను సిద్ధేశ్వరిగా పూజిస్తారు. రామకృష్ణ పరమహంస ఈ ఆలయంలోనే పూజలు చేసేవారని ప్రతీతి. కాగా, ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం, గురువాతం ముగిసిన బంగాల్? మొదటి దశ పోలింగ్?లో 91.78 శాతం ఓటింగ్ నమోదైంది. రెండో దశ పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. కాగా నేటితో బంగాల్ రెండో దశ ఎన్నికల ప్రచారం ముగియనుంది. మే 4న బంగాల్?తోపాటు అసోం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

# ఏయూ చరిత... తరతరాలకు స్ఫూర్తి



(మొదటి పేజీ తరువాయి)




ఆంధ్ర యూనివర్సిటీ ఒక ఇన్‌స్టిట్యూషన్ మాత్రమే కాదు.. నాలాంటి వారికి ఒక ఎమోషన్. తరతరాలుగా మన మనస్సుల్లో మెదులుతోంది. భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ గారికి హృదయపూర్వక స్వాగతం పలకడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మీ సేవాగుణం, నిష్ఠ, ప్రజాసేవ పట్ల మీ అంకితభావం తరతరాలకు ప్రేరణగా నిలుస్తోంది. అదేవిధంగా ఏపీ గవర్నర్, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఛాన్స్‌లర్ ఎస్. అబ్దుల్ నజీర్ గారికి కూడా హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తున్నాం. మీ మార్గదర్శకత్వం, నాయకత్వం ఈ గొప్ప సంస్థను మరింత బలపరుస్తోంది. అదేవిధంగా లక్షలాది హృదయాలను గెలుచుకున్న మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ గారిని స్వాగతించడం గౌరవంగా భావిస్తున్నా. క్రమశిక్షణ, అంకితభావానికి, ప్రతిభకు ఆయన నిదర్శనంగా నిలుస్తారు. దార్శనిక నేత, గౌరవనీయ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి స్వాగతం. విద్యే అభివృద్ధికి పునాది అని ఆయన విశ్వసిస్తారు. వేదికపై ఉన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు గారు, ఒడిశా గవర్నర్ హరిబాబు గారికి, ఇక్కడకు విచ్చేసిన ఇతర ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, సిబ్బంది, విద్యార్థులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

**ఆంధ్ర యూనివర్సిటీ ఒక పేరు మాత్రమే కాదు.. వందేళ్ల చరిత్ర :** 2014లో రాష్ట్రం విడిపోయింది. కట్టుబట్టలతో మెడపట్టి మనల్ని బయటకు గెంటేశారు. రాజధాని లేదు, సచివాలయం లేదు, అసెంబ్లీ లేదు, ముఖ్యమంత్రి గారు కూర్చోవడానికి కుర్చీ లేదు. ఆ రోజు ఆంధ్రప్రదేశ్‌కు ఉన్నవి రెండే. ఒకటి ఆంధ్ర యూనివర్సిటీ, రెండు మన బ్రాండ్ సీబీఎన్. రాష్ట్ర విభజన తర్వాత కేబినెట్ మీటింగ్ పెట్టుకోవడానికి ఒక హాల్ కూడా లేదు. ఆ రోజు మొదటి కేబినెట్ మీటింగ్ ఆంధ్ర యూనివర్సిటీలో పెట్టుకున్నాం. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు మొదటి అసెంబ్లీ సమావేశాలు కూడా ఏయూలోనే నిర్వహించారు. ఆంధ్ర యూనివర్సిటీ ఒక పేరు మాత్రమే కాదు.. వందేళ్ల చరిత్ర.

**దేశంలోనే అత్యంత ప్రాచీన యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి :** స్వతంత్రం రాకముందు తెలుగు ప్రజలు పోరాడి ఆంధ్ర యూనివర్సిటీ సాధించుకున్నారు. ఆంధ్ర యూనివర్సిటీకి ఎన్నో రికార్డ్స్ ఉన్నాయి. దేశంలోనే అత్యంత ప్రాచీన యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి. భాషాప్రయుక్త రాష్ట్రాల్లో మొదటిది ఆంధ్ర రాష్ట్రం. తెలుగు ప్రజల కోసం మనం యూనివర్సిటీని ఏర్పాటుచేసుకోవడం జరిగింది. నేను కార్నెగీ మెలన్ యూనివర్సిటీ, స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఈ రోజు ఇక్కడ మిమ్మల్ని చూసి అసూయ పడుతున్నాను. ఆంధ్ర యూనివర్సిటీలో చదివి ఉంటే ఎంతో బాగుండేదని. పక్కనే వైజాగ్ బీచ్ రోడ్.. అద్భుతమైన సిబ్బంది, ఏయూ స్టూడెంట్స్ జోష్ ఈ రోజు అదిరిపోతోంది. మీ జోష్ చూసిన తర్వాత మీకోసం ఇంకా కష్టపడాలి, పనిచేయాలి. వచ్చే వందేళ్ల చరిత్ర కలిసికట్టుగా సృష్టించాలని కోరుతున్నా.

**ఆంధ్ర యూనివర్సిటీ చరిత్ర వెనుక ఎంతో మంది త్యాగం ఉంది :** మానసిక వికాసం మానవ జీవితానికి అత్యున్నత లక్ష్యంగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారు చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీ చరిత్ర వెనుక ఎంతో మంది త్యాగం ఉంది. ఎంతోమంది పోరాటం ఉంది, కష్టం ఉంది. సీఆర్ రెడ్డి గారు మొదటి వైస్ ఛాన్స్ లర్ గా ఒక క్లియర్ డైరెక్షన్ మనకు అందించారు. తర్వాత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు వైస్ ఛాన్స్ లర్ గా పనిచేశారు. ఆయన విజన్, స్పీడ్, కమిట్ మెంట్ ఆంధ్ర యూనివర్సిటీకి బలమైన పునాది వేసింది. ఎంతోమంది దాతలు ఏయూ అభివృద్ధికి సహకరించారు. ఎంతోమంది వైస్ ఛాన్స్ లర్లు ఆంధ్ర యూనివర్సిటీ అభివృద్ధి కోసం కృషిచేశారు. వైస్ ఛాన్స్ లర్ల కి విజన్ ఉంటే ఆంధ్ర యూనివర్సిటీ లాంటి గొప్ప యూనివర్సిటీలు తయారవుతాయి.

**ఆంధ్ర యూనివర్సిటీ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికే గర్వకారణం :** యూనివర్సిటీని సాధారణంగా విశ్వవిద్యాలయం అంటారు. కానీ మన ఆంధ్ర యూనివర్సిటీని ఆంధ్ర విశ్వకళా పరిషత్ అంటారు. ఇది అకడమిక్ విద్య, లిబరల్ ఆర్ట్స్ సమ్మిళితం. దీనికి మంచి ఉదాహరణ త్రివిక్రమ్ శ్రీనివాస్ గారు. మన ఏయూ నుంచి ఎమ్మెస్సీ న్యూక్లియర్ ఫిజిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు ప్రఖ్యాత సినీ దర్శకులుగా ఆయన ఎదిగారు. ఆంధ్ర యూనివర్సిటీ చిహ్నం దగ్గర నుంచి కోర్సుల వరకు అన్నీ స్పెషల్. ఉన్నత విద్యలో భిన్నమైన ప్రోగ్రామ్స్ ను అందిస్తోంది ఆంధ్ర యూనివర్సిటీ. ఏయూలో 7 అనుబంధ కళాశాలలతో కలిపి 68 అకడమిక్ విభాగాలు ఉన్నాయి. మొత్తం 121 అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులతో పాటు వివిధ పరిశోధనా కార్యక్రమాలు అందిస్తున్నారు. అదేవిధంగా ఏయూకి 304 అనుబంధ కళాశాలలు ఉన్నాయి. సుమారు 85,000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 56 దేశాల నుండి వచ్చిన సుమారు 1050 మంది విదేశీ విద్యార్థులు కూడా ఉన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ ఏపీకి మాత్రమే కాదు.. భారతదేశానికి గర్వకారణం.

**దేశంలోనే ఓవర్ ఆల్ ర్యాంకింగ్స్ లో ఏయూ 3వ స్థానం సాధించడమే లక్ష్యం :** ఆంధ్ర యూనివర్సిటీ ర్యాంక్స్ సాధించడంలో కూడా ముందు ఉంటుంది. ISO సర్టిఫికెట్, నాక్ A++ గ్రేడ్, 2025 ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ లో రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 4వ స్థానంలో నిలిచింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం దేశంలోనే ఓవర్ ఆల్ ర్యాంకింగ్స్ లో 3వ స్థానం, ప్రపంచ ర్యాంకింగ్స్ లో టాప్ 100లో స్థానం సంపాదించినప్పుడే విద్యా శాఖ మంత్రి నాకు సంతృప్తి. ప్రస్తుత వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ గారు దీనిని ఒక లక్ష్యంగా తీసుకుని ఏయూని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని కోరుతున్నా.

**ఫిజిక్స్ నుంచి పాలిటిక్స్ వరకు ఆంధ్ర యూనివర్సిటీ మార్క్ శాశ్వతంగా ఉంది :** ఆంధ్ర యూనివర్సిటీలో చదువుకున్న వారు గొప్ప స్థాయికి వెళ్లారు. ఫిజిక్స్ నుంచి పాలిటిక్స్ వరకు ఆంధ్ర యూనివర్సిటీ మార్క్ శాశ్వతంగా ఉంది. లోక్ సభ తొలి దళిత స్పీకర్ గా పనిచేసిన జీఎంసీ బాలయోగి గారు ఏయూ విద్యార్థి. ఉప రాష్ట్రపతిగా పనిచేసిన వెంకయ్యనాయుడు గారు, కే.హరిబాబు, దువ్వూరి సుబ్బారావు, బీవీఆర్ మోహన్ రెడ్డి, పూర్ణ ఆర్.సగ్గుర్తి, గ్రంధి మల్లికార్జున రావు, చావా సత్యనారాయణ ఏయూ విద్యార్థులే. రాజకీయాల్లో కూడా ఏయూ స్టూడెంట్స్ నెం.1. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఏయూ ప్రొడక్టే. వారి ఎదుగుదల యాదృచ్ఛికం కాదు. నిరంతర పోరాటం, త్యాగం, సంకల్పబలం వల్లే వారు అత్యుతన్నత స్థాయికి ఎదిగారు. సమాజంలో మనం కోరుకున్న మార్పు రావాలంటే రాజకీయాల్లోకి మరింతమంది రావాల్సిన అవసరం ఉంది.

**ప్రజలకు సేవ చేయాలని ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చా :** ఇక్కడ ఉన్న స్టూడెంట్స్ కి నా జీవిత ప్రయాణం గురించి కూడా చెప్పాలని అనుకుంటున్నా. నేను కార్నెగీ మెలన్ యూనివర్సిటీ, స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నాను. వరల్డ్ బ్యాంక్ లో పనిచేశా. హెరిటేజ్ లో కూడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా ఉన్నా. ప్రజలకు సేవ చేయాలని 2013లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చా. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశా. 2019లో మంగళగిరి నుంచి పోటీ చేసి 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. మొదటిరోజు బాధపడ్డాను. ఆ తర్వాత ఆ బాధ నాలో కసి, పట్టుదల పెంచింది. 2024లో మళ్లీ అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజార్టీ 91వేల ఓట్లతో గెలిచాను. ఇది మీకు ఎందుకు చెబుతున్నానంటే నో రిస్క్, నో స్టోరీ అని గుర్తుపెట్టుకోవాలి. ఇక్కడున్న వారు జీవితంలో ఎన్నో సాధించారు. ఎంతో త్యాగం చేశారు. సవాళ్లను ఎదుర్కొన్నారు. అపజయాలే విజయానికి సోపానాలు.

**పరిశ్రమలతో అనుసంధానం అనేది చాలా ముఖ్యం :** ఏయూ వందేళ్ల ప్రయాణం పూర్తిచేసుకుంది. కాలం మారుతోంది. సాంకేతికత మారుతోంది. అందుకే వీసీ ఆధ్వర్యంలో మన కరిక్యులమ్ లో కూడా మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంది. పరిశ్రమలతో అనుసంధానం అనేది చాలా ముఖ్యం. గౌరవ సీఎం గారు చాలా స్పష్టంగా చెప్పారు. ఇండస్ట్రీ, అకడమియా కనెక్ట్ అవసరం ఉందని. కేవలం తరగతి గదుల్లో చదువుకోవడం మాత్రమే కాదు.. కనీసం ఒక ఏడాదన్నా ఫీల్డ్ కు వెళ్లాలి, వాస్తవాలు తెలుసుకోవాల్సిన అవసరం విద్యార్థులపై ఉందన్నారు. సీఎం ఆదేశాలను నేను స్వీకరిస్తున్నా. ఆ మార్పు కూడా మేం తీసుకువస్తామని తెలియజేస్తున్నా. నాలుగేళ్ల ఇంజనీరింగ్ చేస్తే జాబ్ రాదు.. అదే అమీర్ పేటలో నాలుగు నెలల కోర్సు చేసి జాబ్ కొడతారు. అదే స్కిల్ గ్యాప్. దీనికి ఫుల్ స్టాప్ పెట్టాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. దానికి మేం అహర్నిశలు కష్టపడతామని తెలియజేస్తున్నా.

**ఏడాదిలోగా పెండింగ్ పోస్టులు భర్తీ చేస్తాం :** అతి చిన్న వయసులో విద్యాశాఖ మంత్రిగా నన్ను సీఎం చంద్రబాబు గారు నియమించారు. నేను విద్యాశాఖ తీసుకుంటానంటే కష్టమని, వద్దని చాలామంది వారించారు. దేశ చరిత్ర తిరిగి రాయాలంటే మా పిల్లలే రాయాలని నేను ఛాలెంజ్ ను స్వీకరించడం జరిగింది. ఇంకా మార్పులు తీసుకురావాలి. నిధులు కేటాయించాలి. మౌలిక వసతులే కాదు.. శాశ్వత సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. పెండింగ్ పోస్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని సీఎం గారు చెప్పారు. వచ్చే ఏడాదిలోగా పెండింగ్ పోస్టులు భర్తీ చేస్తాం. హయ్యర్ ఎడ్యుకేషన్ పైన ఎక్కువ దృష్టిపెట్టాలని ప్రధాని గారు చెబుతున్నారు. రీసెర్చ్ ను ఎక్కువగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

**రీసెర్చ్ కోసం ఏయూకు రూ.250 కోట్లు కేటాయించాలని సీఎంను కోరుతున్నా :** ఉత్తరాంధ్ర రాష్ట్రానికి ఒక ఎకనామిక్ జోన్ గా మారబోతోంది. రేపు గూగుల్ డేటా సెంటర్ కు శంకుస్థాపన చేయబోతున్నాం. గడిచిన ఆరు నెలల్లో ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్ట్ ప్రారంభించాం. సీఎం చేతులమీదుగా ఇంగోట్ సోలార్ వేఫర్ యూనిట్ కు శంకుస్థాపన చేయడం జరిగింది. వారికి కావాల్సిన కరిక్యులమ్ తయారుచేసే బాధ్యత ఏయూ తీసుకోవాలని కోరుతున్నా. ఆంధ్ర యూనివర్సిటీకి కనీసం రూ. 250 కోట్లు నిధులు కేటాయించి రీసెర్చ్ ను పెద్దఎత్తున ప్రోత్సహించాలని సీఎం గారిని కోరుతున్నా. వచ్చే వందేళ్ల విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని సిబ్బంది, వీసీని ఆదేశించాం. ప్రతి ఐదేళ్లలో యూనివర్సిటీ ఏం సాధించాలనేది అందులో స్పష్టంగా ఉండాలని, స్టూడెంట్స్ ఫీడ్ బ్యాక్ కూడా తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు కే.రామ్మోహన్ నాయుడు, భారతరత్న, ప్రముఖ ఇండియన్ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ఒడిశా గవర్నర్ కే.హరిబాబు, కేంద్రమంత్రులు భూపతిరాజు శ్రీనివాస వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, సైయెంట్ గ్రూప్ వ్యవస్థాపకులు బీవీఆర్ మోహన్ రెడ్డి, ఏయూ వైస్ ఛాన్స్ లర్ జీపీ రాజశేఖర్, ప్రముఖ సినీ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు

# 266వ జయంతి




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)::** అమరావతి ప్రభువు వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 266వ జయంతిని అత్యంత ఘనంగా నిర్వహించారు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చిత్ర పటానికి వాసిరెడ్డి వంశానికి చెందిన 6వ తరం వారసుడు, అమరావతి సంస్థానం ఫౌండర్ ట్రస్టీ శ్రీమంత్ రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ మన్నే సుల్తాన్ బహదూర్ తో కలసి జిల్లా రెవిన్యూ అధికారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ప్రజాహిత పాలన, ధార్మికత, అభివృద్ధి దృక్పథం నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. సమాజ సంక్షేమం కోసం ఆయన చూపిన దారిని అనుసరించడం అవసరమని తెలిపారు. వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు (27 ఏప్రిల్ 1761 -- 17 ఆగస్టు 1817) ఆంధ్రదేశ చరిత్రలో అపూర్వమైన జమీందారు, పరిపాలనలో దిట్ట అన్నారు. గుంటూరు, కృష్ణా ప్రాంతాలను సమర్థంగా పరిపాలిస్తూ శాంతి భద్రతలను బలోపేతం చేసి ప్రజల విశ్వాసాన్ని పొందారని చెప్పారు. ఆయన పాలనలో వ్యవసాయం విస్తృతంగా అభివృద్ధి చెందిందన్నారు.

అమరావతిని రాజకీయ, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దిన మహానుభావుడిగా ఆయన చరిత్రలో చిరస్థానం సంపాదించారని పేర్కొన్నారు. అమరేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధిలో విశేష పాత్ర పోషించడంతో పాటు మంగళగిరి, చెబ్రోలు, పొన్నూరు ప్రాంతాల్లో మూడు వందలకు పైగా దేవాలయాలను నిర్మించి, పునరుద్ధరించారన్నారు. 108 దేవాలయాలలో ఒకేసారి ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించి అరుదైన చరిత్ర సృష్టించారని తెలిపారు. వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ప్రజాహిత పాలన, న్యాయబద్ధత, పారదర్శకతకు ప్రతీకగా నిలిచారని అభిప్రాయపడ్డారు. ఆయన చేసిన సేవలు నేటికీ ఆదర్శప్రాయంగా నిలుస్తూ సమాజ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి వాసిరెడ్డి వంశానికి చెందిన 6వ తరం వారసుడు, అమరావతి సంస్థానం ఫౌండర్ ట్రస్టీ శ్రీమంత్ రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ మన్నే సుల్తాన్ బహదూర్ పాల్గొని మాట్లాడుతూ 266వ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ధర్మప్రచారం, అన్నదానాలు, గోసంరక్షణ వంటి సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించారన్నారు. కవులు, పండితులను ఆదరించి సాహిత్య, సాంస్కృతిక రంగాలకు విశేషంగా సేవలందించారని చెప్పారు.

అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తూ రాజా వాసిరెడ్డి సేవలను కొనియాడారు. ప్రజాహిత పాలనకు ప్రతీకగా తరతరాలకు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం,వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ, ఇన్ ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రావణ్ బాబు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పర్యాటక అధికారి రమ్య, దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ మాధవి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, దేవదాయ ధర్మదాయ శాఖ గ్రేడ్ వన్ విశ్రాంత కార్య నిర్వహణ అధికారి లగుమ వరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఇదొక మంచి అవకాశం!



**వాషింగ్టన్ :** యుద్ధ పరిణామాలపై చర్చించేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశం కావడం మంచి అవకాశమని ఇరాన్ విదేశాంగ మంత్రి అరగ్చి వ్యాఖ్యానించారు. పుతిన్‌తో చర్చలు జరిపేందుకు సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు చేరుకున్న ఆయన ఇరాన్ ప్రభుత్వ మీడియాతో మాట్లాడారు. పశ్చిమాసియాలో యుద్ధంతో పాటు తాజా పరిణామాలు అలాగే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ అంశాలపై కూడా చర్చలు జరపనున్నట్లు తెలిపారు. పాకిస్తాన్, ఒమన్, దేశాల్లో పర్యటన అనంతరం ఆయన రష్యాలో పర్యటిస్తున్నారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని అంతమొందించే లక్ష్యంతో జరగాల్సి వున్న రెండో దశ శాంతి చర్చలపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో పాక్ అగ్ర నాయకత్వంతో ఫలవంతమైన చర్చలు జరిగాయని వ్యాఖ్యానించారు. ఆదివారం సాయంత్రం పాక్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌తో భేటీ ముగిసిన అనంతరం అరగ్చి మాస్కో చేరుకున్నారు.

ఇదిలావుండగా, మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన భద్రతా సలహాదారులతో ఇరాన్ యుద్ధంపై చర్చిస్తున్నారు. తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై జాతీయ భద్రతా బృందంతో, విదేశీ విధాన బృందంతో ట్రంప్ చర్చలు జరుపుతారని అమెరికా గ్లోబల్ వ్యవహారాల విలేకరి బారక్ రావిద్ అంతకుముందు చెప్పారు. టెహ్రాన్ ప్రతిపాదించిన కొత్త ఒప్పందం అమెరికా విధించిన పరిమితులను చేరుకోలేకపోయిందని పేరు వెల్లడించని ఇరువురు అమెరికా అధకారులు వ్యాఖ్యానించారు. ఆ నేపథ్యంలో ట్రంప్ చర్చలు జరుగుతున్నాయి. హార్మూజ్‌ను తిరిగి తెరవడంపై అదే సమయంలో అమెరికా విధించిన నావికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడంపై ప్రధానంగా ఆ ఒప్పందం దృష్టి కేంద్రీకరించింది. అయితే ఇస్లామాబాద్ వచ్చిన ఇరాన్ విదేశాంగ మంత్రి అరగ్చి అమెరికా ప్రతినిధి బృందాన్ని కలుసుకోకుండా వెళ్లడంతో ట్రంప్ కూడా అమెరికా బృందాన్ని వెళ్లవద్దంటూ ఆదేశాలు జారీ చేశారు. 'ఇరాన్ చర్చలు కావాలనుకుంటే వారే మా వద్దకు వస్తారు, లేదా మాకు ఫోన్ చేస్తారు.' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఉభయపక్షాల మధ్య చర్చలు ప్రతిష్టంభనలో పడిన నేపథ్యంలో ఈ పరిస్థితికి కారణం అమెరికానే అని ఇరాన్ దౌత్యవేత్త ఒకరు వ్యాఖ్యానించారు.

**హార్మూజ్ తెరుస్తాం...అయితే :** అణు ఒప్పందం లేకుండానే హార్మూజ్‌ను తిరిగి తెరిచేందుకు ఇరాన్ ప్రతిపాదించింది. ఈ మేరకు కొత్త ప్రతిపాదనను పాకిస్తాన్‌కు అందచేసింది. అయితే అదే సమయంలో తమపై అమలు చేస్తున్న బ్లాకేడ్‌ను వెంటనే ఎత్తివేయాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ఈ ప్రతిపాదన వివరాలు గురించి తెలిసిన ఇద్దరు అమెరికా అధికారులు ఈ అంశాలను వెల్లడించారు. వారు తమ పేర్లు వెల్లడించడానికి ఇష్టపడలేదు. కొత్త ప్రతిపాదన పాకిస్తాన్ నుండి అమెరికా చేతికి అందింది. అయితే ఈ ప్రతిపాదనకు ట్రంప్ సుముఖంగా లేరని తెలుస్తోంది.

# విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా ప్రయోజనాల కోసమే సంస్కరణలు తెస్తున్నామని ఆ సంస్కరణల అమలు కోసం టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసే అంశంపై నిరంతరం అధ్యయనం, జరుగుతూనే ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ పై సీఎం చంద్రబాబు సమీక్షించారు. వేసవిలో విద్యుత్ సరఫరా, 2026-27 ఏడాదిలో పవర్ ప్రొక్యూర్మెంట్ ప్లాన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించారు. వేసవిలో ప్రతి రోజూ 275 నుంచి 285 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటుందని అంచనా వేసినట్టు అధికారులు చెప్పారు. ఈ నెలలో ఇప్పటి వరకు 6397 మిలియన్ యూనిట్ల విద్యుత్ ను వినియోగించు కున్నామని వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం మేర విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. విద్యుత్ వినియోగం పెరగడానికి వేసవితో పాటు పారిశ్రామిక వినియోగం కూడా పెరిగిందని అధికారులు వివరించారు. వచ్చే ఆరు నెలల కాలానికి విద్యుత్ కొనుగోళ్ల ప్రణాళికలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. ఏప్రిల్ 2025లో విద్యుత్ కొనుగోలు ధర రూ. 5.20 ఉండగా.. మార్చి 2026 నాటికి రూ. 4.90కు తగ్గించామని అధికారులు చెప్పారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలవుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**పునరుత్పాదక విద్యుత్ పై దృష్టి :** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."విద్యుత్ కొనుగోళ్ల వ్యయం తగ్గాలి. ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో.. అలాంటి చర్యలన్నింటి పైనా అధికారులు దృష్టి పెట్టాలి. విద్యుత్ రంగంలో ఏయే దేశాల్లో ఎలాంటి కొత్త ఆవిష్కరణలు అమలు అవుతున్నాయో అధ్యయనం చేయాలి. ఈ ఏడాది చివరి నాటికి విద్యుత్ కొనుగోలు ధరను రూ. 4.60కు తగ్గించాలి. ఈ దిశగా విద్యుత్ శాఖాధికారులు దృష్టి సారించాలి. విద్యుత్ రంగంలో సహా ఏ రంగంలో నైనా ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతోనే సంస్కరణలు అమలు చేస్తున్నాం. ప్రజలకు మేలు చేయాలంటే టెక్నాలజీ వినియోగం అత్యంత అవసరం. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ నిరంతరం గుర్తు చేసుకోవాలి. విద్యుత్ లో రీసెర్చ్ అండ్ అనాలసిస్ కు పెద్ద పీట వేయాలి. దీని కోసం ట్రాన్స్ కో, జెన్కో వంటి సంస్థలు తమకున్న సీఎస్సార్ నిధులు కేటాయించాలి. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయింపులు జరిపేలా చర్యలు తీసుకుంటాం. పంప్డ్ స్టోరేజీ విధానంలో విద్యుత్ ఉత్పత్తిపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. ఎనర్జీ యూనివర్శిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. పొల్యూషన్ తగ్గేలా... పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలి. 2028-29 నాటికి సగాని పైగా విద్యుత్ ఉత్పత్తి రెన్యూవబుల్ ఎనర్జీ ద్వారా వచ్చేలా చూడాలి. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 52396 సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇచ్చాం. దీన్ని మరింత వేగవంతం చేయాలి. ఇకపై ప్రతి నెల 2 లక్షల పీఎం సూర్య ఘర్ కనెక్షన్లు ఇచ్చేలా చూడాలి. పీఎం కుసుమ్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 2.94 లక్షల కనెక్షన్లు ఇచ్చాం. మొదటి విడత పీఎం కుసుమ్ పథకాన్ని డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలి. ఇక ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కొనుగోళ్లపై పెద్ద ఎత్తున ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, విద్యుత్, ట్రాన్సుకో, జెన్కో, వివిధ డిస్కంలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అటవీ సంపదను తగలబెడితే ఊరుకోం!



**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతి పట్టణానికి సమీపంలోని శేషాచలం అడవుల్లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణశాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదం కారణంగా అటవీ సంపదకు భారీ స్థాయిలో నష్టం జరగడం దురదృష్టకరమన్నారు. వేసవి తీవ్రత తగ్గే వరకు అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిప్రమాదానికి కొంత మంది గంజాయి, మద్యం సేవించిన ఆకతాయిలు కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్న క్రమంలో తీవ్రంగా స్పందించారు. ఘటనకు కారకులైన వారిని గుర్తించి అరెస్టు చేయాలని, అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు సిబ్బంది సమీప గ్రామాల ప్రజల సహకారం తీసుకుని తక్షణ నష్టనివారణ చర్యలు చేపట్టాలన్నారు.

శనివారం తిరుపతి పట్టణానికి ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలోని బయోట్రిమ్ వెనుక భాగంలో చోటు చేసుకున్న అగ్నిప్రమాద ఘటనపై పీసీసీఎఫ్ పి.వి.చలపతి రావు, ఇతర అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంటలను సాధ్యమైనంత త్వరగా అదుపులోకి తీసుకువచ్చే విధంగా తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంటలు మరింత విస్తరించకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. తిరుపతి ఘటనపై పీసీసీఎఫ్ వివరణ తీసుకోవాలని, పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ఉపముఖ్యమంత్రి వారి కార్యాలయ అధికారులను ఆదేశించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే యాంటి ఫైర్ స్క్వాడ్ సిబ్బంది 20 మంది, పోలీసులు, మరో 10 మంది టీటీడీ సిబ్బంది మంటలను అదపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారని, ఈ రోజు మధ్యాహ్నం మంటలు పూర్తిగా అదుపులోకి వస్తాయని అటవీ అధికారులు తెలియజేశారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. యాంటి రెడ్ శాండర్స్ స్క్వాడ్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ కి వెళ్లిన సమయంలో అనుమానాస్పద చర్యలపై ఓ కన్నేసి ఉంచాలి. జూన్ చివరి వరకు ఉండే వేసవిలో అటవీ ప్రాంతంలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

**సరిహద్దు గ్రామాల్లో అవగాహన సదస్సులు :** జనసమ్మర్ధం ఉండే అటవీ మార్గాల్లో మఫ్టీలో అటవీ సిబ్బందితోపాటు పోలీసులను నియమించి ఆకతాయిలు, అటవీ విధ్వంసానికి పాల్పడే వారి కదలికలపై నిఘా ఉంచాలి. అగ్నిప్రమాదాల నివారణకు అవసరం అయితే అటవీ పరిసర గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి. అపరిచితులు, అనుమానితులు, ఆకతాయిలు అటవీ పరిసరాలకు వెళ్లే ప్రయత్నం చేస్తే వారిని ఆయా గ్రామాల ప్రజలే అడ్డుకోనే విధంగా అవగాహన కల్పించాలి. దీంతో పాటు అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు వీలుగా తక్షణం స్పందించే విధంగా ప్రజల్ని తీర్చిదిద్దాలని సూచించారు. పెద్ద ఎత్తున మంటలు వ్యాపిస్తుంటే సిబ్బంది చేరుకునేలోపు మరింత విస్తరించకుండా జాగ్రత్తలు పాటించే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

## జలధార - జలహారతికి ఫీడర్ కాలువుల పునరుద్ధరణ ప్రధానం




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జలధార - జలహారతి కార్యక్రమంలో ఫీడర్ కాలువుల పునరుద్ధరణ ప్రధానమని పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ శివప్రసాద్ అన్నారు. జలధార - జలహారతి అవగాహన, శిక్షణ కార్యక్రమం ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జలవనరుల శాఖ ఇంజనీర్లు, నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం జలధార - జలహారతి ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకు వంద రోజుల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందన్నారు. సరయిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, సరయిన పనులు చేపట్టాలని సూచించారు. సమగ్రమైన పనులు నాణ్యతతో చేపట్టాల్సి ఉందని చెప్పారు. ప్రాణికోటికి నీరు అవసరం అన్నారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన నీటిని అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్రంలో 38 వేల చెరువులు ఉన్నాయని, వీటితో పాటు ఇంకా అనేక జలవనరుల ప్రదేశాలు ఉంటాయని చెప్పారు. 14 వేల ఆరు వందల చెరువులను పూర్తి స్థాయిలో నింపగలుగుతున్నామని తెలిపారు. 3,300 చెరువులకు నీరు రావడం లేదని, 4,600 చెరువులలో 25 శాతం మాత్రమే నిండుతున్నాయని వివరించారు. చెరువులకు వచ్చే కాలువలు వివిధ కారణాల వలన ప్రక్కకు మళ్ళించి ఉండవచ్చని, వాటిని గుర్తించి తిరిగి యథా స్థితికి తీసుకురావాలని చెప్పారు. 6.80 లక్షల జల సంరక్షణ పనులను జల వనరుల శాఖ గుర్తించిందన్నారు. మరమ్మతులు మాత్రమే కాకుండా కొత్త పనులు కూడా చేపట్టవచ్చని తెలిపారు. పచ్చదనం పెంచే పనులు చేయవచ్చని పేర్కొన్నారు. ఫీడర్ కాలువులు సక్రమంగా పారుటకు నిర్మాణాల నాణ్యతలో పక్కాగా ఉండాలని చెప్పారు. అన్ని చిన్న నీటిమడుగుల పునరుద్ధరణ, ఫీడర్ కాలువల మరమ్మత్తులు, నీటి వనరుల అనుసంధానం, వరద నీటి వినియోగం మట్టి మరియు నీటి సంరక్షణ పనులు, రిడ్జ్ టు వ్యాలీ పద్ధతి అమలు, పచ్చదనం పెంపు, కొత్త నీటి నిల్వ నిర్మాణాలు, టెక్నాలజీ వినియోగం, చెరువుల ఫీడర్ ఛానల్స్ శుభ్రపరచడం, గట్లను బలోపేతం చేయడం, చెరువులను సమీపంలోని కాలువలు లేదా వాగులతో అనుసంధానించడం, మొక్కల పెంపకం, కొత్త నీటి సంరక్షణ నిర్మాణాల ఏర్పాటు, గ్రామ నీటి బడ్జెట్ తయారీ తదితర అంశాలను చేపట్టడం జరుగుతుందని అన్నారు.

జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ రమేష్ మాట్లాడుతూ జలధార - జలహారతి పనుల గుర్తింపు, మంజూరు, అమలు చేయాలన్నారు. జల వనరులను పరిరక్షించడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. భూగర్భ జలాలు పెంచాలని, గొలుసుకట్టు చెరువులను నింపాలని అన్నారు. ఉపాధి హామీ అనుసంధానంతో పనులు చేపట్టాలని నిర్దేశించడం జరిగిందని చెప్పారు. ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేటట్లు చూడాలని అన్నారు. వర్షాకాలం తరువాత కూడా భూగర్భ జలాలు మూడు మీటర్లు మేర ఉండాలనేది ఆశయం అన్నారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు మాట్లాడుతూ సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని అన్నారు. నీటి కొరత ఉన్న గ్రామాలు గుర్తించి అటువంటి చోట పనులు చేయుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. భూగర్భ జల శాఖ ఉప సంచాలకులు వందనం మాట్లాడుతూ నీరు ప్రాణాధారం అన్నారు. భూగర్భ జలాలను కాపాడుకోవాలని చెప్పారు. ప్రతి కుటుంబం ఏడాదికి సరాసరిన రెండు లక్షల లీటర్లు వినియోగిస్తుందని, అయితే కనీసం పది వేల లీటర్లు భూమిలోకి పంపించే చర్యలు చేపట్టడం లేదన్నారు. గుంటూరు జిల్లాలో 40 గ్రామాల్లో 6 మీటర్ల కంటే లోతులో ఉందన్నారు. ఆ గ్రామాలపై దృష్టి సారించాలని కోరారు. జిల్లాలో 37 పీజియో మీటర్లు, 29 అబ్జర్వేషన్ వెల్స్ ఉన్నాయని, తద్వారా భూగర్భ జలాల పరిశీలన చేస్తున్నామని అన్నారు. చేబ్రోలు మండలం చేకూరు గ్రామంలో మాత్రమే 11.37 మీటర్ల మేర జలాలు అందుబాటులో ఉందని చెప్పారు. ఐదు మండలాల్లో ఆరు మీటర్ల కంటే లోతులో నీరు లభ్యం అవుతుందని తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలో చెరువుల పూడికలు తీయడం, గట్లను బలోపేతం చేయడంతో భూగర్భ జలాలు పెరిగాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా నీటి వి. యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, బాపట్ల జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, పల్నాడు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. సిద్ధలింగ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఇన్ఫోసిస్‌కు విశాఖలో 20 ఎకరాలు కేటాయింపు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కార్పొరేట్ సంస్థలకు దాదాపు ఉచితంగా భూములు అప్పగిస్తున్న విధానంపై వస్తున్న విమర్శలను రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. తాజాగా ఇన్ఫోసిస్‌కు ఎకరా 99పైసల 20 ఎకరాలను విశాఖ పట్నంలో కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఐటి శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐటీ క్యాంపస్ ఏర్పాటు యెండాడ గ్రామం (హిల్) వద్ద ఈ కేటాయింపులు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 750 కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొదటి దశ ప్రాజెక్ట్‌ను 2029 జనవరి నాటికి, మొత్తం ప్రాజెక్ట్‌ను 6 సంవత్సరాల్లో పూర్తి చేయాలని పేర్కొన్నారు. రహదారులు, నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను ఎపిఐఐసి అభివద్ధి చేయనుంది.




## వైద్యసేవ బకాయిల మోక్షం!




(మొదటి పేజీ తరువాయి)

జమ చర్యలు మొదలయింది. బిల్లుల చెల్లింపు చర్యల గురించి పురోగతి గురించి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈఓ చక్రధర్ బాబు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ కు నివేదించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ట్రస్టు అనుబంధ ఆసుపత్రులకు రూ.5,556 కోట్లు చెల్లించింది. ఇందుకు అదనంగా మరో రూ. 1,000 కోట్లను ప్రైవేటు ఆసుపత్రులకు ప్రభుత్వం చెల్లించేశీదుకు సిద్ధమైంది.

**బిల్ డిస్కౌంటింగ్ అగ్రిమెంట్ విధానమంటే..! :** రాష్ట్రప్రభుత్వం తరపున ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ప్రభుత్వ రంగ సంస్థ) రూ.1,000 కోట్లను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అందచేసిన జాబితా ప్రకారం చెల్లిస్తోంది. ఈ క్రమంలో సదరు ఆసుపత్రుల యజమాన్యాలకు చెల్లించాల్సిన మొత్తంలో ఏడాదికి చెల్లించాల్సిన వడ్డీ ముందుగానే మినహాయించి, మిగిలిన మొత్తాన్ని పవర్ కార్పొరేషన్ వారు చెల్లిస్తున్నారు. దీనికోసం ఆర్థిక శాఖ తరపున ప్రత్యేకంగా వెబ్ పోర్టల్ తయారైంది. ఈ పోర్టల్ లాగిన్, పాస్వర్డ్, ఇతర వివరాలను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అధికారులు ఆసుపత్రుల వారికి పంపించారు. ఈ పోర్టల్ లో ఉన్న వివరాలు అనుసరించి, అసుపత్రుల యాజమాన్యాలు బకాయిలు పొందుతున్నాయి. ఈ పోర్టల్ లో ప్రభుత్వం చెల్లించబోతున్న బిల్లుల చెల్లింపు అమౌంట్ వివరాలు, వడ్డీ కింద మినహాయించిన మొత్తం, ఇతర వివరాలు ఉన్నాయి. ఒప్పంద పత్రాలపై ఆసుపత్రులు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్లోని అధీకృత అధికారులు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈఓ సంతకాలు కూడా చేస్తున్నారు.

**కూటమి ప్రభుత్వం ద్వారా ఇప్పటివరకు జరిగిన చెల్లింపులు రూ.5,556 కోట్లు :** గత వైకాపా ప్రభుత్వం రూ.2,403 కోట్ల బకాయిలను ఆసుపత్రులకు జూన్, 2024 నాటికి చెల్లించాల్సి ఉంది. జూన్ 2024 నుంచి ఏప్రిల్ 5, 2026 వరకు కూటమి ప్రభుత్వం రూ.6,900 కోట్ల విలువైన వైద్య సేవలను ప్రజలకు అందించింది. ఇందులో రూ.3,162.68 కోట్లు ఆసుపత్రుల యాజమాన్యాలకు ఇప్పటివరకు చెల్లించింది. గత వైకాపా ప్రభుత్వం మిగిల్చిన (రూ.2,403 కోట్లు) బకాయిలను కూడా ప్రభుత్వం చెల్లించింది. వీటితో కలిపితే మొత్తం రూ.5,556 కోట్లు కూటమి ప్రభుత్వం ఆసుపత్రుల యాజమాన్యాలకు చెల్లించింది. ఇవిపోగా ఆసుపత్రులకు ఇంకా రూ.3,746.68 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో ప్రైవేటు అసుపత్రులకు చెల్లించాల్సి మొత్తం రూ.2,044.17 కోట్లు. ఇందులోనే రూ.1,000 కోట్ల చెల్లింపులు ప్రస్తుతం జరు గుతున్నాయి.

## ప్రతి గింజా కొనుగోలు చేస్తాం



(మొదటి పేజీ తరువాయి)

అక్కడి నుంచే సివిల్ సప్లై డీఎం మరియు జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రస్తుతం 400 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తున్నామని అధికారులు చెప్పగా.. అవసరమైతే ధాన్యం కొనుగోలు టార్గెట్‌ను పెంచి నిడదవోలు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. "చివరి గింజ వరకు కొంటామని మేము రైతులకు హామీ ఇచ్చాం.. ఆ హామీని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది" అని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మిల్లర్ల వల్ల ఎదురవుతున్న సమస్యలను రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి దుర్గేష్ తమ వద్దకు వచ్చి సమస్యలు వినడం పట్ల రైతులు, కూలీలు సంతోషం వ్యక్తం చేశారు. వారితో సరదాగా ముచ్చటించిన మంత్రి.. తనతో ఫోటో దిగాలని కోరిన కూలీలు, రైతుల విన్నపాన్ని మన్నించి వారితో కలిసి ఫోటోలు దిగారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ "తూర్పుగోదావరి జిల్లాలోనే అత్యధిక ధాన్యం పండించే ప్రాంతం నిడదవోలు. ఇక్కడి రైతులకు ఏ చిన్న సమస్య వచ్చినా నా కార్యాలయ అధికారులకు నేరుగా ఫోన్ చేయవచ్చు. ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకుండా చూసే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది." అన్నారు.

## ఐతానగర్ పేరంటాళ్ళమ్మ తిరునాళ్ళు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక ఐతానగర్ లోవేంచేసియున్న గ్రామదేవత,శ్రీ వెంకయ్య-గౌరమ్మ పేరంటాలమ్మ తిరునాళ్ళ మహోత్సవములు, సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. మేనెల 1వ తేదీతొ ముగిసే తిరునాళ్ళను, ఐతానగర్ వాసులతొ పాటు, పట్టణంలోని పలు ప్రాంతాల వారు, నాలుగురోజుల ఉత్సవ వేడుకల్లొ పాల్గని, మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితి. ఈ నాలుగు రోజులు తిరునాళ్ళ మహోత్సవములు వివరములు. ఉత్సవాల్లో భాగంగాఈనెల బుధవారం సాయంత్రం గుమ్మడిశిడి. ఊరేగింపు 30వ, తేదీ గురువారం జలబిందెలు,పూలకప్పెర. 1వతేదీ శుక్రవారం పొంగళ్ళు,గండదీపాలు, అడుగులు-మడుగులు, ఆరోజు మధ్యాహ్నం నుండి పసుపు బండ్లు, కరెంటుప్రభలు, మేకసిడి,గంపసిడులు తో తిరునాళ్ళు ముగుస్తాయి. ఎంతో వైభవంగా నిర్వహించే తిరునాళ్ళ మహోత్సవములలో, పరిసర ప్రాంత భక్తులుతిరునాళ్ళకు విచ్చేసి పేరంటాలమ్మ తల్లి ఆశీస్సులు పొందే అవకాశం వినియోగించు కోవాలని నిర్వాహకులు కోరారు. తిరునాళ్ళు ప్రారంభ సందర్భంగా అఖండ దీపారాధన,, ఉత్సవ మూర్తులతొ శోభాయాత్ర చేశారు.

## ఘనంగా రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి వేడుకలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** అమరావతి సంస్థానాదీశులు, దానశీలి రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు జయంతి వేడుకలు అధికారిక ఉత్సవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటి నందు జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిఐటియు ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రో- ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ వెంటాద్రినాయుడుకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ మంచి పనులు చేస్తే వందల సంవత్సరాల తర్వాత కూడా గుర్తుండిపోతారు అనడానికి వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు జీవితం నిదర్శనం అని అన్నారు. ఆయన పరిపాలనా దక్షత, మరియు క్రమశిక్షణ నేటితరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన పాలనలో ధర్మపరిరక్షణకు కృషిచేశారని, మంగళగిరి క్షేత్రంలో ఆయన నిర్మించిన దక్షిణభారతదేశంలోనే ఎతైన గాలిగోపురం, తన సంస్థాన గ్రామాలలో నిర్మింపచేసిన 101 శైవ ఆలయాలు, 101 వైష్ణవ ఆలయాలు నేటికి ఆయన కీర్తిని చాటుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఫ్రెష్మన్ డా॥ ఎమ్. వి. రఘురామ్, వివిఐటియు పబ్లికేషన్ డివిజన్ సంధానకర్త మోదుగుల రవికృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ లక్ష్మికుమారి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పెట్రోల్ డీజిల్ కు ఎటువంటి కొరత లేదని, ఫేక్ ప్రచారాలు నమ్మవద్దని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తెనాలి మండలంలోని అన్ని బంకులు దగ్గర రెవెన్యూ, పోలీస్ సిబ్బందితొ, పెట్రోల్ డీజిల్ కొరతను అధిగమించే చర్యలు చేపడుతున్నట్లు సబ్ కలెక్టర్ లక్ష్మీ కుమారి తెలిపారు. ఆదివారం సాయంత్రం నుండి డీజిల్ కొరత అంశం, పెట్రోల్ బంకుల దగ్గర కలకలం రేపిన నేపథ్యంలో, రాష్ట్రపౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్, ఆయా జిల్లా కలెక్టర్లతో ఉన్నతాధికారులతో, ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వాస్తవ పరిస్థితులు వివరిస్తూ, తగు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో, సోమవారం పట్టణంలోని పెట్రోల్ బంకుల వద్ద, వాస్తవ పరిస్థితులపై అధికారులు ఆరా తీశారు. పెట్రోల్ బంకుల్లో జీరో నిల్వలు ఉన్నట్లు నిర్ధారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ వాస్తవంగా పెట్రోల్ డీజిల్ కొరత లేదని, ఆయా కంపెనీలకు డీడీలు చెల్లించిన వారికి, డీజిల్ సరఫరా అవుతోందని, ప్రతి పెట్రోల్ బంకు దగ్గర, రెవెన్యూ పోలీస్ సిబ్బందిని ఉంచి, విక్రయాలు సక్రమంగా జరిగేలా చూస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు కూడా అపోహలు పెంచుకోవద్దన్నారు. వినియోగ దారులు రోజు వారి అవసరాల మేరకు, ఇందనం తీసుకోవాలని, డీజిల్ దొరకదనే ఆందోళన వద్దన్నారు.రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. మండల తహసిల్దార్ కె వి గోపాలకృష్ణ మాట్లాడుతూ తెనాలి మండలంలో 20 పెట్రోల్ బంకులో ఉన్నట్లు తెలిపారు. బీపీసీఎల్ 7, హెచ్పీసీఎల్ 4, ఐఓసీఎల్ 7, నయారా ఒకటి, రిలయన్స్ ఒకటి వంతున బంకులు ఉన్నాయని, డీడీలు చెల్లించిన వారికి, సాయంత్రం లోగా బంకులకు, 7 లోడులు డీజిల్ వస్తుందన్నారు. అనవసరమైన, అపోహలతో, డీజిల్ పెట్రోల్, నిల్వ చేసే ఆలోచన విరమించుకుని,రోజువారి ఎంతవరకు అవసరమో అంతే తీసుకోవాలన్నారు. తనిఖీలొ రెవిన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్రోల్ కొరతపై అపోహలు సృష్టించవద్దు - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- బంకుల వద్ద తనిఖీలు, ప్రభుత్వ కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగుతుంది
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పలు పెట్రోల్ బంక్ లను తనిఖీ చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** పెట్రోల్ కొరత పై ప్రజల్లో అపోహలు సృష్టించవద్దని, పెట్రోల్ బంకుల వద్ద ప్రభుత్వ కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగుతుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే డ తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు గళ్ళా మాధవి పేర్కొన్నారు. సోమవారం పెట్రోల్ కొరత పై వస్తున్న వార్తల నేపథ్యంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి బృందావన్ గార్డెన్స్ సెంటర్, లాడ్జి సెంటర్ సహా పలు పెట్రోల్ బంకులను సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బంకు నిర్వాహకులతో మాట్లాడి నిల్వ వివరాలు తెలుసుకొని నిల్వ కేంద్రాలను పరిశీలించారు. లిఅనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ....లి ప్రస్తుతం కనిపిస్తున్న పెట్రోల్ కొరత అసలు కొరత కాదని, కేవలం కృత్రిమ కొరత వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. కొన్ని ప్రచారాల కారణంగా ప్రజలు ముందుగానే భారీగా పెట్రోల్ నింపుకోవడంతో అవసరం ఒక్కసారిగా పెరిగి, బంకులపై ఒత్తిడి ఏర్పడిందని చెప్పారు. దుకాణాలు మూసివేయడానికి కూడా ఇదే కారణమని, ముందస్తుగా నిల్వలు కొనుగోలు చేయడం వల్ల సాధారణ సరఫరా కంటే ఎక్కువ అవసరం ఏర్పడిందని నిర్వాహకులు వెల్లడించినట్టు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు పెట్రోల్ బంక్ యజమానులు, ఆయిల్ సంస్థలతో సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారని, ప్రతి పెట్రోల్ బంక్ వద్ద ఒక గ్రామ రెవెన్యూ అధికారి, ఒక పోలీసు సిబ్బందిని నియమించి కట్టుదిట్టమైన పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్టు ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. అలాగే జిల్లా కలెక్టర్ కూడా పరిస్థితిని సమీక్షిస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

నియోజకవర్గంలోని బంకుల పరిస్థితిని పరిశీలించగా, చాలా బంకులు సాధారణంగా పనిచేస్తున్నాయని, రోజువారీ విక్రయాల కంటే ఎక్కువగా విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. కొన్ని బంకుల్లో ఇప్పటికే ప్రభుత్వం ఒకేసారి అధికంగా పెట్రోల్ నింపకుండా నియంత్రణలు విధించిందని, కార్లకు రూ. 1000 వరకు మాత్రమే, ద్విచక్ర వాహనాలకు రూ. 100-రూ. 200 వరకు మాత్రమే నింపాలని సూచనలు జారీ చేసినట్టు చెప్పారు. ప్రజలు భయంతో ముందుగానే ట్యాంకులు నింపుకోవడం వల్ల నిజంగా అవసరమైన వారికి ఇబ్బంది కలగకుండా చూడడమే ఈ నియంత్రణల ఉద్దేశమని స్పష్టం చేశారు. కొన్ని బంకుల్లో "నిల్వ లేదు" బోర్డులు కనిపించడానికి కారణం గత రాత్రి భారీ అవసరం వల్ల నిల్వ అయిపోవడమేనని, ప్రస్తుతం కొత్త ఆర్డర్లు పెట్టి సరఫరా కొనసాగుతోందని తెలిపారు. అలాగే ఆయిల్ కంపెనీలు ముందుగా అప్పుగా సరఫరా చేయకుండా, అదే రోజున చెల్లింపు చేయాల్సిన విధానం అమలులోకి రావడంతో కొంత ఆలస్యం జరుగుతోందని వివరించారు. అయితే ఈరోజు రాత్రి లేదా రేపటి ఉదయం నాటికి ఎక్కువ శాతం బంకులు పూర్తిగా సాధారణ స్థితికి వస్తాయని తెలిపారు. ప్రజలు భయపడకుండా ప్రశాంతంగా ఉండాలని, అవసరానికి మించిన పెట్రోల్ నిల్వ చేయకుండా సహకరించాలని కోరారు. ప్రభుత్వం, అధికారులు, పోలీసులు కలిసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి భరోసా ఇచ్చారు.

## మంత్రి నారా లోకేష్ చొరవతో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

- దివీస్ లాబొరేటరీస్ సహకారంతో గ్రామాభివృద్ధికి మరో అడుగు
- మంత్రి నారా లోకేష్, దివీస్ సంస్థకు గ్రామస్తుల కృతజ్ఞతలు



**పెదవడ్లపూడి, (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ చొరవతో, దివీస్ లాబొరేటరీస్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్,మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, లు ప్రారంభించారు. ఈ సందర్భంగా నందం అబద్దయ్య మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించేందుకు మంత్రి నారా లోకేష్ దివీస్ లాబొరేటొరీస్ వారి సహకారం తో వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేయించారని,ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించే నాయకత్వం నారా లోకేష్ గారిదని కొనియాడారు, పెదవడ్లపూడి గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా గ్రామస్తుల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పాటు అందిందన్నారు. ఈ సహకారం అందించిన దివీస్ లాబొరేటరీస్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి నారా లోకేష్‌కు, దివీస్ సంస్థ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, అన్నే చంద్రశేఖర్, మారెళ్ల సాంబశివరావు, కతారి సాంబయ్య, జాలాది సందీప్, భావన సాంబులు, బోయపాటి రమేష్, మీనిగల వెంకటేష్, బొర్ర శ్రీకాంత్, కొప్పాక ఓంకార్, అమ్మయ్య చౌదరి, కొండపల్లి కిషోర్, యేళ్ళ మల్లయ్య, జవ్వాది రామారావు, సతీష్, రవీంద్ర, బొమ్మినేని శ్రీనివాసరావు, కంచర్ల వెంకటేశ్వరరావు, నాగళ్ళ రామకృష్ణ, అంకబాబు, మేకా గోపి తదితరులు పాల్గొన్నారు

## నెల రోజుల్లో గిరి ప్రదక్షణ రోడ్డు పూర్తి..

- ఘాట్ రోడ్డుకు 4 కోట్లు నిధులు, వారంలో పనులు ప్రారంభం
- శరవేగంగా శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణ పనులు
- ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్) :** వినుకొండ శ్రీ రామలింగేశ్వర స్వామి కొండచుట్టు జరుగుతున్న గిరి ప్రతిక్షణం రోడ్డు నిర్మాణం పనులను ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు సోమవారం పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి రోడ్డు పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ గిరి ప్రదక్షిణ రోడ్డు 1.80కోట్లతో నిర్మాణం పనులను రెండు నెలలుగా శరవేగంగా చేపట్టడం జరిగిందన్నారు. మరో నెల రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయడం జరుగుతుందని వివరించారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో బొల్లా బ్రహ్మానాయుడు గిరిప్రదక్షిణ రోడ్డు నిర్మాణం నిర్లక్ష్యం చేశాడని విమర్శించారు. మెట్ల మార్గాన్ని తొలగించి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయ నిర్మాణం, గిరిప్రదక్షిణ రోడ్డు, ఘాట్ రోడ్డు నిర్మాణం తమ హయాంలో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయము కొండపై ఘాట్ రోడ్డు నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయుడు 4 కోట్లు నిధులు కేటాయించారని, మరో వారం రోజుల్లో పనులు ప్రారంభించడం జరుగుతుందన్న. చరిత్ర కలిగిన వినుకొండ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ పురం నిర్మాణం, ఘాట్ రోడ్, గిరి ప్రదర్శన రోడ్డును పూర్తి చేసి ఆధ్యాత్మికంగా ఒక పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చీఫ్ విప్ జీవి ఆంజనేయులు వివరించారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలి

- జిల్లా రెవిన్యూ అధికారి నారదముని

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** పల్నాడు కలెక్టరేట్ నరసరావుపేట: సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా రెవిన్యూ అధికారి నారదముని అర్జీలను స్వీకరించారు. అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 232అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి నారదముని మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆయా శాఖల పరిధిలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీదారులతో మాట్లాడాలని, పెండింగ్ ఆడిట్ పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు వారి పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

## డీజిల్ కోసం ఆందోళన అవసరం లేదు... సరిపడా నిలువలు ఉన్నాయి

- జిల్లా కలెక్టర్, ఎస్పి వెల్లడి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో సరిపడా నిలువలు ఉన్నాయని, డీజిల్ కోసం ఆందోళన అవసరం లేదని జిల్లా కలెక్టర్ సి. యం. సాయి కాంత్ వర్మ స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన సమస్యపై వస్తున్న వార్తల పట్ల సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ వివరించారు. నగరం పాలెం భారత్ పెట్రోల్ బంకును, వెంకటప్పయ్య కాలనీ లోని హెచ్. పి పెట్రోల్ బంకును స్వయంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజలకు అవసరమైన మేరకు ఇంధన సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు అపోహలకు లోనుకావద్దని కోరారు. పెట్రోల్ బంకుల్లో సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. జిల్లాలో సరాసరిన రోజుకు 450 నుండి ఐదు వందల కిలో లీటర్ల విక్రయాలు జరుగుతాయని, అయితే గత రెండు రోజులుగా రోజుకు ఏడు వందల నుండి ఎనిమిది వందల కిలో లీటర్ల విక్రయాలు జరిగాయని తెలిపారు. వెయ్యి కిలో లీటర్ల డీజిల్, ఏడు వందల కిలో లీటర్ల పెట్రోల్ సోమవారం నాటికి హెచ్. పి. సి. ఎల్, ఐ. ఓ. సి. ఎల్, బి. పి. సి. ఎల్ కంపెనీల నుండి సరఫరా అయిందన్నారు. ఆదివారం నాటికి డ్రై అవుట్ అని 85 బంకులు బోర్డులు పెట్టినట్లు గమనించడం జరిగిందని, అన్ని బంకులకు ఇంధనం సరఫరా చేయడం జరిగిందని, సాయంత్రం 6 గంటల వరకు 49 బంకులలో డ్రై అవుట్ పరిస్థితి ఉందని, రెండు, మూడు గంటలలో వాటికి కూడా సరఫరా అయ్యేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ముఖ్యమంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈ అంశంలో ప్రత్యేక చొరవతో పనిచేస్తూ, ఆదేశాలు జారీ చేస్తున్నారని అన్నారు. మంగళ వారం ఉదయం నాటికి అన్ని బంకులు పూర్తి స్థాయిలో పని చేయుటకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యలు ఉంటే ఆయిల్ కంపెనీ వారిని సంప్రదించి స్టాక్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి బంక్ వద్ద ఒక రెవిన్యూ ఉద్యోగిని, ఒక పోలీసు కానిస్టేబుల్‌ను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు.

జాయింట్ కలెక్టర్, పోలీస్ సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీలు చేసి పరిశీలించడం జరిగిందన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. బంకులలో నిల్వలను అనుసరించి ముందుగా ఇండెంట్ లు పెట్టి ఇంధనం సరఫరా అయ్యేటట్లు చూస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎంత అవసరమో అంతే కొనుగోలు చేయాలని, భయాందోళనలతో అధికంగా కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతులకు, అత్యవసర సేవలకు ఇంధనం పంపిణీలో ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశామని చెప్పారు. కనిష్ట నిలువలు ఉన్నా విక్రయాలు చేయాలని బంకులకు ఆదేశాలు జారీ చేశామని అన్నారు.

**సోషల్ మీడియాలో కథనాలపై నిఘా**

సోషల్ మీడియాలో వచ్చే కథనాల పట్ల నిఘా పెట్టడం జరిగిందని వివరించారు. వచ్చిన పోస్టులను పోలీసు సూపరింటెండెంట్ కు పంపించామని, తక్షణ చర్యలకు ఉపక్రమించడం జరిగిందని చెప్పారు. పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ భయంతో కొనుగోలు వద్దని కోరారు.

## విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



- పాఠశాలలు ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ కావాలి
- 25 ఏళ్లపాటు పాఠశాల నిర్వహణ అభినందనీయం
- రాష్ట్రంలో తల్లికి వందనంతో ప్రతి విద్యార్థికీ భరోసా
- భారతీ పబ్లిక్ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** మారుతున్న పరిస్థితులను అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాఠశాలలను అప్ గ్రేడ్ కావడం అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక శ్రీనగర్ లోని భారతీ పబ్లిక్ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత పాఠశాల చైర్మన్ బాపట్ల శ్రీనివాసరావు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ 25 సంవత్సరాలపాటు విద్యా సంస్థలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా కొందరికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రతి విద్యార్థీ చదువులకు ఎలాంటి ఆటంకం రాకుండా చూడాలనే ఉన్నత సంకల్పంతో తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 65 లక్షల మంది విద్యార్థులు తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని చెప్పారు. విద్యార్థులకు సృజనాత్మకమైన, ఆలోచనాత్మకమైన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పోటీతత్వాన్ని అలవాటు చేస్తూనే అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని చెప్పారు. విద్యార్థులు ఏయే రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారో గుర్తించి ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. అలాంటప్పుడేను నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తారని తెలిపారు. రాష్ట్రంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఉన్నత విద్యా ప్రమాణాలతో పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. విద్యార్థులపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గురువులు సారథ్యంలో తల్లిదండ్రుల బాధ్యతతో విద్యార్థులు మంచి పౌరులుగా ఎదుగుతారని తెలిపారు.

## పి.జి.ఆర్.ఎస్‌కు 499 అర్జీలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో పి. జి. ఆర్. ఎస్ కు మొత్తం 499 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి. జి. ఆర్. ఎస్ కు 250, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి. జి. ఆర్. ఎస్ కు 186 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 4 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 16 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 36, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 7 అర్జీలు అందాయి. సోమవారం ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజావలి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ అర్జీలను సమర్పించారు.

**అందిన కొన్ని అర్జీల వివరాలు**

గుంటూరు పట్టణం నెహ్రూ నగర్ నుండి ఉమామహేశ్వరి అనే మహిళ అర్జీని సమర్పిస్తూ మహిళా సంఘం నుండి రావలసిన డబ్బులు ఇవ్వడం లేదని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామం నుండి గుళ్ళ పానకాలు అర్జీని సమర్పిస్తూ పొలం ఆక్రమణకు గురి అయ్యిందని, చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రత్తిపాడు మండలం బొంతపాడు గ్రామం నుండి శుద్ధపాడు మేరీ అర్జీ సమర్పిస్తూ వికలాంగ పింఛను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు,పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె. వి. వి సత్యనారాయణ, డి. ఆర్. డి. ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయ లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి బి. వి. నాగ సాయి కుమార్, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్. ఎస్. వి. రమణ, ఇన్ ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రావణ్ బాబు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. శంకర్, జిల్లా పర్యాటక అధికారి రమ్య, దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ మాధవి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి. వి. రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి, ముఖ్య ప్రణాళిక అధికారి పి. శేష శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ చొరవతో మంజూరైన ఎల్‌వోసీల అందజేత



**మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి పట్టణంలోని పార్క్‌రోడ్ చెందిన షేక్ సుభాని కి మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ. 3,00,211 విలువైన ఎల్‌వోసీ పత్రాన్ని,ద్వారకా నగర్ కి చెందిన తోట వినయ్ కుమార్ కు రూ. 61,734 ల విలువైన ఎల్‌వోసీ మంజూరు చేశారు. భాదితుల ఇళ్ళ కు వెళ్ళి నాయకులు మంజూరు పత్రాలను అందజేశారు, ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, షేక్ కరిముల్లా, పిల్లి సంపత్, బాపనపల్లి వాసు, పిల్లెళ్ళ నాగరాజు, గంగాధర్, దొడ్డి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు .

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## టెక్నాలజీతో నాణ్యమైన వైద్యసేవలు



- వందల కిలో మీటర్ల దూరం నుంచి అందుబాటులోకి స్పెషలిస్టుల సేవలు
- దేశంలోనే తొలి టెలి-రోబోటిక్ సర్జరీ చేసిన నారాయణ-జీఎస్ఎల్ ఆస్పత్రులకు సీఎం అభినందన

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** టెక్నాలజీని సమర్థంగా వినియోగిస్తే వైద్య సేవలను ప్రజలకు మరింత సులభతరం చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబును నారాయణ మెడికల్ కాలేజీ–ఆస్పత్రులు, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ–ఆస్పత్రుల యజమాన్యాలకు చెందిన ప్రతినిధులు కలిశారు. ఇటీవల తమ రెండు ఆస్పత్రులు కలిసి టెలి–రోబోటిక్ సర్జరీ నిర్వహించినట్టు సీఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. టెలి–రోబోటిక్ సర్జరీ జరిగిన తీరును ఆయా మెడికల్ సంస్థల యాజమాన్యాలకు చెందిన ప్రతినిధులు సింధూర, గన్ని భాస్కరరావు సీఎంకు వివరించారు. నెల్లూరులోని నారాయణ హాస్పిటల్లో ఉన్న రోగికి రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆస్పత్రి వైద్యులు రోబో ద్వారా సర్జరీ చేశామని... అలాగే జీఎస్ఎల్లో ఉన్న రోగికి నారాయణ ఆస్పత్రి వైద్యులు దూరం నుంచే శస్త్రచికిత్స నిర్వహించారని తెలిపారు. దేశంలోనే తొలిసారి ఈ తరహా సర్జరీ నిర్వహించినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా రెండు ఆస్పత్రుల యజమాన్యాలను సీఎం చంద్రబాబు అభినందించారు. టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే దూరంగా ఉన్నా సరే నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చని ఈ సంస్థలు నిరూపించాయని సీఎం అన్నారు. రెండు రోజుల వ్యవధిలో నాలుగు సర్జరీలను విజయవంతంగా పూర్తి చేయడం విశేషమన్నారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న రోగులకు కూడా ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించిన డాక్టర్లు ఎక్కడి నుంచైనా సర్జరీ చేయగలిగే ఈ సాంకేతికత భవిష్యత్తులో వైద్య సేవల రూపురేఖలను పూర్తిగా మార్చేస్తుందని సీఎం పేర్కొన్నారు.

## బంకులను తనిఖీ చేసిన కలెక్టర్




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ సోమవారం పెట్రోల్ బంకులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరం పాలెం భారత్ పెట్రోల్ బంకును, వెంకటప్పయ్య కాలనీ లోని హెచ్.పి పెట్రోల్ బంకును జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. బంకులలో ఇంధన నిల్వలు, విక్రయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంధనం కోసం వచ్చిన వినియోగదారులతో ముఖాముఖి మాట్లాడి పరిస్థితులను ఆరా తీసారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజలకు అవసరమైన మేరకు ఇంధన సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు అపోహలకు లోనుకావద్దని కోరారు. పెట్రోల్ బంకుల్లో సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యలు ఉంటే ఆయిల్ కంపెనీ వారిని సంప్రదించి స్టాక్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి బంక్ వద్ద ఒక ఉద్యోగిని నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. ఆదివారం రాత్రి జిల్లా కలెక్టర్ తో సహా, జాయింట్ కలెక్టర్, పోలీస్ సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీలు చేసి పరిశీలించడం జరిగిందన్నారు. సోమవారం ఉదయం నుంచి అధికారులు తనిఖీలు చేశారని, సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి వేడుకలు



**మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం లో గాలిగోపురాన్ని నిర్మించిన మహానుభావుడు శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు గారి జయంతి సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉన్న రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు వారి చిత్రపటానికి దేవస్థానం ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.,ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు,ధర్మకర్తల మండలి సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

## బంకులలో అధికారుల తనిఖీ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లాలో పెట్రోల్, డీజిల్ పరిస్థితులను పర్యవేక్షించుటకు జిల్లా అధికారులు ఆయా ప్రాంతాల్లో బంకు లను తనిఖీ చేయడం జరుగుతోంది. ఆదివారం రాత్రి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, పోలీస్ సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీలు చేసిన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం నుంచి అధికారులు తిరిగి తనిఖీలు ప్రారంభించి, సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

## పెట్రోల్, డిజీల్ కొరతపై సీఎం, ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ

- ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో అధికారుల వరుస సమావేశాలు
- క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు సీఎంకు నివేదించిన అధికారులు
- 11,909 కిలో లీటర్ల పెట్రోల్, 19707 కిలో లీటర్ల డీజిల్ సరఫరా చేసిన ఆయిల్ కంపెనీలు
- ఆదివారం నాటికంటే మెరుగైన సరఫరా
- రాత్రిళ్లు కూడా లోడ్ డిస్పాచ్ జరపాలని సీఎం ఆదేశం
- సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకు ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలని సీఎం ఆదేశం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఏర్పడిన పెట్రోల్, డీజిల్ కొరతపై నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి... విశాఖకు బయలు దేరే ముందు మరోసారి పరిస్థితిపై సమీక్షించారు. అలాగే విశాఖ నుంచి మరోసారి టెలి కాన్ఫరెన్స్ చేపట్టారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సమస్య సాధారణ స్థితికి చేరుకునేంత వరకు ఎవ్వరూ విశ్రమించవద్దని... ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉండాలని స్పష్టం చేశారు. ఆయిల్ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతూ... క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. సోమవారం మొత్తంగా 2679 లోడ్లను రాష్ట్రంలోని వివిధ పెట్రోల్ బంకులకు పంపాలని ప్రణాళికలు సిద్ధం చేస్తే... వాటిల్లో 2079 లోడ్లు ఇప్పటికే బయలుదేరాయి. వీటిల్లో కొన్ని గమ్యస్థానాలకు చేరుకున్నట్టు అధికారులు వివరించారు. ఇక మిగిలిన మరో 600 లోడ్లను డిస్పాచ్ చేసేందుకు సిద్దమవుతున్నారు. ఈ 2079 లోడ్లల్లో 11909 కిలో లీటర్ల పెట్రోల్, 19707 కిలో లీటర్ల డీజిల్ వివిధ బంకులకు వెళ్లాయి. రాష్ట్రంలోని మూడు ఆయిల్ సరఫరా కంపెనీలైన ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్పీసీఎల్ సంస్థల ద్వారా ఈ మొత్తం లోడ్ డిస్పాచ్ అయింది. ప్రతి లోడ్ కు రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని అటాచ్ చేసి పంపుతున్నట్టు అధికారులు తెలిపారు. డిస్పాచ్ అయ్యే ప్రాంతం నుంచి దూరంగా ఉండే ప్రాంతాలకు లోడ్లు చేరడం కొంచెం ఆలస్యమవుతోందని అధికారులు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ లోడ్ డిస్పాచ్ రాత్రి పూట కూడా జరపాలని సీఎం ఆదేశించారు. ఆదివారం నాటితో పోల్చుకుంటే సోమవారం నాడు ఆయిల్ సరఫరా మెరుగైంది. ఇక సోమవారం ఉదయంతో పోల్చుకుంటే... అనకాపల్లి, తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా, బాపట్ల, పల్నాడు, నంద్యాల, అనంతపురం, మార్కాపురం వంటి జిల్లాల్లో బంకుల్లో పెట్రోల్, డీజిల్ లభ్యత మెరుగైంది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నాడు రాత్రి ఏడు గంటల సమయానికి 6511 కిలో లీటర్ల పెట్రోల్, 9046 కిలో లీటర్ల మేర అమ్మకాలు జరిగాయి.

## ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించిన గోడపత్రికను సోమవారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా పదాధికారులు ఉల్లూరి గంగాధర్, ఏనుముల నాగేశ్వరరావు, కోస్తా జోనల్ ఇన్చార్జి మేకల లక్ష్మణ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సర్వశుద్ధి రాజు పాల్గొన్నారు.

రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పనతల సురేష్ సూచనలతో అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను మూడు వారాలపాటు రాష్ట్రవ్యాప్తంగా విభిన్న రూపాల్లో నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించేలా ఈ కార్యక్రమాలను వినూత్న రీతిలో చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఈ ఉత్సవాల్లో భాగంగా కడప జిల్లా కేంద్రంగా నిర్వహించనున్న "భజన కోలాట బృందాల సమ్మేళనం" కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమం రెండు రోజులపాటు కొనసాగనుండగా, రాష్ట్ర నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కళాకారులు పాల్గొననున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏనుముల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉల్లూరి గంగాధర్ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుంచి రాజమహేంద్రవరం కేంద్రంగా ఉత్సవాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించామని, విశాఖపట్నం కేంద్రంగా "సమరసత మారథాన్ 3కే రన్", తిరుపతిలో క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. కోస్తా జోనల్ ఇన్చార్జి మేకల లక్ష్మణ్ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి ఉత్సవాల చివరి కార్యక్రమం విజయవాడ కేంద్రంగా మే మొదటి వారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. డప్పు కళాకారుల బృందాలతో భారీ డప్పుల ప్రదర్శన నిర్వహించి, లోకనాయకుడు, ప్రపంచ మేధావి డాక్టర్ అంబేద్కర్కు ఘన నివాళులు అర్పిస్తూ ఉత్సవాలను ముగించనున్నట్లు వెల్లడించారు.

## కాంగ్రెస్ ద్రోహంపై గర్జించిన మహిళా లోకం

- మహిళా బిల్లుపై కాంగ్రెస్కు వ్యతిరేకంగా మహిళా మోర్చా కాగడాల ప్రదర్శన



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్) :** మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ కుట్రపూరితంగా అడ్డుకుందని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో విజయవాడలో సోమవారం భారీ ఆక్రోశ ర్యాలీ, కాగడాల ప్రదర్శన నిర్వహించారు. స్టేడియం నుంచి సీతారామపురం సెంటర్ వరకు మహిళలు భారీగా పాల్గొని నినాదాలతో నగరాన్ని మార్మోగించారు.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ మహిళల దశాబ్దాల కల అయిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు అమలు దిశగా కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసినా, కాంగ్రెస్ మరియు వామపక్ష కూటములు రాజకీయ కుట్రలతో బిల్లును వీగిపోయేలా చేశాయని మండిపడ్డారు. మహిళల సాధికారతకు అడ్డుపడుతున్న విపక్షాల తీరును దేశవ్యాప్తంగా ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

మహిళల హక్కులను కాలరాస్తూ కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం మాత్రమే కాంగ్రెస్ మహిళలను ఉపయోగించుకుంటోందని ఆమె విమర్శించారు. విపక్షాల వైఖరిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చామని, అందులో భాగంగానే విజయవాడలో కాగడాల ప్రదర్శన చేపట్టామని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ కూటమికి మహిళలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మహిళా మోర్చా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు ఎస్వీకే పద్మజ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నప్పటికీ, రాజకీయాల్లో వారికి అవకాశాలు ఇవ్వకుండా కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళలను గౌరవిస్తూ మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టారని, మహిళలను నిజంగా గౌరవించే పార్టీ బీజేపీ మాత్రమేనని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతో పాటు దాని మద్దతుదారులు మహిళలను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరి, ఉపాధ్యక్షురాలు పాలడుగు సుభాషిణి, కార్యదర్శి చిగురుపాటి లక్ష్మి, కార్యాలయ కార్యదర్శి కంభంపాటి మాధవి, సోషల్ మీడియా ఇన్చార్జి శిరీష, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి సిహెచ్ శివలలిత, మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షర్మిల ఖతూన్, కార్యదర్శి షకీలా బేగం, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు రత్నకుమారి, ఎర్ర సునీత, స్వరూపరాణి, డాక్టర్ దుర్గాశ్రీలక్ష్మి, పోలే శాంతి, కల్లూరి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## ఐడీబీఐ బ్యాంక్ నూతన శాఖను ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్




- అన్ని వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలు చేరువ కావాలని సూచన
- ప్రభుత్వ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపు..బ్యాంక్ అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని భరోసా
- ఐడీబీఐ యాజమాన్యానికి మరియు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దుర్గేష్

**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్) :** అన్ని వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలు చేరువ కావాలి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలోని గణపతి సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన ఐడీబీఐ బ్యాంక్ నూతన బ్రాంచ్ను సోమవారం మంత్రి దుర్గేష్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.

అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ దేశంలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న బ్యాంకుల్లో ఐడీబీఐ ఒకటిగా పేరుగాంచిందని, అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు నిడదవోలులో తన శాఖను విస్తరించడం సంతోషకరమని అన్నారు. ఈ బ్యాంక్ ద్వారా స్థానిక వ్యాపారస్తులు, రైతులు, యువత, మహిళలకు గొప్ప మేలు జరుగుతుందని ఆకాంక్షించారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారికి తగిన ఆర్థిక వెసులుబాటు కల్పించాలని సూచించారు. కేవలం బ్యాంకింగ్ లావాదేవీలకే పరిమితం కాకుండా, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిడదవోలులో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని బ్యాంక్ ప్రతినిధులను కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు బ్యాంకులు తమ వంతు తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. బ్యాంక్ అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇస్తూ.. ఐడీబీఐ యాజమాన్యానికి మరియు సిబ్బందికి మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరి వాలీబాల్ లీగ్-4 రెండవ రౌండ్ డ్రా నిర్వహణ



- 32 జట్ల మధ్య 16 ఉత్కంఠభరిత మ్యాచ్లకు రంగం సిద్ధం

**మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి వాలీబాల్ లీగ్–4 (వీఎూ–4) రెండవ రౌండ్లో జరగనున్న మ్యాచ్లకు సంబంధించిన డ్రా కార్యక్రమం సోమవారం సాయంత్రం తాడేపల్లి నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జట్టు సభ్యులు, క్రీడాకారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రెండవ రౌండ్లో మొత్తం 32 జట్లు పోటీపడగా,వాటి మధ్య 16 మ్యాచ్లు జరగనున్నాయి. డ్రా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, జట్లకు మ్యాచ్ల క్రమాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు,గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు,టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి లు మాట్లాడుతూ, మంగళగిరి వాలీబాల్ లీగ్కు క్రీడాభిమానుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ టోర్నమెంట్ను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారురాబోయే రెండవ రౌండ్ మ్యాచ్లు ఉత్కంఠభరితంగా సాగనున్నాయని, ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, తాడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు దాసరి కృష్ణ, దుగ్గిరాల మండల పార్టీ అధ్యక్షులు కేసంనేని శ్రీ అనిత, ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ ఇబ్రహీం,ఏపీ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్,షేక్ రియాజ్,గొర్ల వేణుగోపాల రెడ్డి, దొంతిరెడ్డి సాంబిరెడ్డి,అరవపల్లి శ్రీనివాసరావు,గుత్త కిషోర్, చిలువూరు యేసుపాదం,కేసంనేని వాసుబాబు,షేక్ ఖాసీం బాబు, షేక్ మస్తాన్ వలి,కంభం సాయి చంద్,ఎండీ ఆరిఫ్,అమీర్ మున్ను, దర్శి హరికృష్ణ,తాడిబోయిన గోపి,కంతేటి విజయ్ చంద్,తోటకూర వెంకన్న, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండుగగా వీరబ్రహ్మేంద్రుడి బ్రహ్మరథోత్సవం

- బ్రహ్మంగారి మఠంలో అంగరంగ వైభవంగా రథోత్సవం

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ) :** శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి 333వ ఆరాధన మహోత్సవాలు మఠం క్షేత్రంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన లిరథోత్సవంలి సోమవారం భక్తజన సందోహం మధ్య కనులపండువగా సాగింది.

**ఆధ్యాత్మిక శోభతో రథోత్సవం ప్రారంభం**

మఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాముల వారులి రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వామి నామస్మరణతో మఠం పరిసర ప్రాంతాలు మారుమోగాయి. రంగురంగుల పుష్పాలు తోరణాలతో ముస్తాబు చేసిన రథాన్ని లాగేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.



**హాజరైన ప్రముఖులు**

ఈ వేడుకలో మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే లిపుట్టా సుధాకర్ యాదవ్లి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మఠాధిపతుల ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మంగారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.



**పాల్గొన్న అధికారులు:** శాంతిభద్రతలు మరియు ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా ఈ కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ , బద్వేల్ రెవిన్యూ డివిజన్ ఆర్డీవో చంద్రమోహన్, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు, మఠం సిబ్బంది మరియు వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.




**భక్తులకు కల్పించిన సౌకర్యాలు**

ఆరాధన ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రెవిన్యూ మరియు పోలీస్ శాఖల ఆధ్వర్యంలో గట్టి ఏర్పాట్లు చేశారు శాంతిభద్రతల పై పోలీస్ డిపార్ట్మెంట్ తీసుకున్న నిర్ణయం పై భక్తులు హర్షం వ్యక్త పరిచారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు కలిగించడంపై స్వామి వారి భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467